## తమిళనాడును వదలని వర్షాలు

చెన్నై,ఆగస్ట్31: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కన్యాకుమారి జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ కుండపోత వర్షం కురిసింది. గురువారం రాత్రి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములు మెరుపులు, పెనుగాలులతో కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. శుక్రవారం ఉదయం 7.30 గంటల నుండి గంటసేపు కుండపోతగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతూ వానలో తడుస్తూనే పాఠశాలకు వెళ్లారు. నాగర్‌కోవిల్(ఔజీణసఇనీతి)లోని మీనాక్షిపురం రోడ్డు, అశంబురోడ్డు కోట్టార్ రోడ్డు తదితర రహదారుల్లో వర్షపునీరు వరదలా ప్రవహించింది.తక్కలై, కుళిత్తురై, మార్తాండం, ఇరానియల్, మయిలాడి, కొట్టారం, అంజుగ్రామం, ఆరల్‌వాయ్‌మొళి, ముల్లంగివినై తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి జోరుగా వర్షం కురిసింది. తిరుపరప్పు జలపాతం పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఆ ప్రాంతం వద్ద చల్లటి వాతావరణం చోటుచేసుకుంది.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 09 సంచిక :168 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: ఆదివారం 01-09-2024 పేజీలు:4 వెల: 2.00


## భారీ వర్షాలతో విజయవాడ అతలాకుతలం



విజయవాడ,ఆగస్ట్31,:భారీ వర్షాలతో విజయవాడ ఒక్కసారిగా వణికిపోయింది. కుంభవృష్టితో ఎక్కడికక్కడ నీళ్లు నిలిచిపోయాయి. కొండచరియలు సమీపంలోని ఇళ్లపై విరిగిపడ్డాయి. ఈ దుర్ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఆరుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కొండచరియల ధాటికి ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఇంకా శిథిలాల కింద ఎవరైనా ఉన్నారేమో అన్న అనుమానంతో యుద్ధ ప్రాతిపదికన శిథిలాలను అధికారులు తొలగిస్తున్నారు. మొగల్రాజపురం సున్నపుబట్టి సెంటర్ వద్ద ఈ కొండ చరియలు విరిగిపడిన ఘటన జరిగింది. మరికొన్ని ప్రాంతాల్లో కూడా కొండ చరియలు విరిగిపడినట్టు చెబుతున్నారు. దీంతో అప్రమత్తమైన అధికారులు ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను ఖాళీ చేయిస్తున్నారు. ఇప్పటికే ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సందర్శించారు. అక్కడ కొండచరియలు విరిగిపడిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఓ ళ్లు పూర్తిగా ధ్వంసమైంది. మరో మూడు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలు అయ్యాయి. కొండచరియలు విరిగిపడ్డ ప్రాంతానికి చేరుకున్న ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. ధ్వంసమైన ఇళ్ల శిథిలాలను తొలగిస్తున్నారు అధికారులు. శిథిలాల కింద మరికొందరు ఉన్నట్టు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్న వేళ వాటిని జాగ్రత్తగా పనులు చేస్తున్నారు. విజయవాడలో రాత్రి నుంచి పడుతున్న వర్షంపై అధికారులను మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ అప్రమత్తం చేశారు . నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్రతో ఫోన్‌లో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. రాత్రి నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు,రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. డ్రైనేజీలలో నీరు పారుదలకు ఆటంకాలు లేకుండా సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. విజయవాడ సహా రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న వేళ విద్యుత్ అధికారులతో మంత్రి గొట్టిపాటి రవి సమీక్ష నిర్వహించారు. అధికారులను అప్రమత్తం చేశారు. ప్రజల ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా ప్రజలకు సమస్యల్లేకుండా చూడాలన్నారు. ప్రమాదంల నివారణపై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని హితవుపలికారు. భారీ వర్షాలు కురుస్తున్న వేళ రైతులు, ఇతర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి రవి సూచించారు. అవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని కోరారు. విద్యుత్ తీగలు తెగిపడిన, కిందకు జారిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. వాటిని తాకడం, పక్కకు నెట్టడం లాంటి పనులు చేయవద్దని హితవు పలికారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు ఆలస్యం లేకుండా వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు రవి.

## రాష్ట్రంలోనూ హైడ్రా తరహా చర్యలు

హైదరాబాద్, హైదరాబాద్ తరహాలో రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. చెరువులు, కుంటలు, నాలాలు, ఇతర నీటి వనరుల పరిరక్షణ కోసం నడుం బిగించాలని అధికార, విపక్ష పార్టీలు కూడా కోరుకుంటున్నాయి. కబ్జాల నుంచి చెరువులు, భూములను కాపాడుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ క్రమంలో వాల్టా చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు రాష్ట్ర సర్కారు సిద్ధమవుతున్నది. హైడ్రా తరహాలోనే జిల్లాలు, మండలాలు, గ్రామాల్లోనూ అథారిటీలను ఏర్పాటు చేయాలనే డిమాండ్ నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తున్నది. వాస్తవానికి నీటి వనరుల ఆక్రమణలను అడ్డుకునేందుకు, కూల్చేందుకు వాల్టా ద్వారా ఏర్పాటైన కమిటీలకు విస్తృతాధికారాలు ఉన్నప్పటికీ.. చట్టం అమలులో గత పాలకులు నిర్లక్ష్యం చేశారు. చివరికి వాల్టా అనగానే.. ఇష్టారాజ్యంగా బోర్లు వేయకుండా నిరోధించే, చెట్లు నరకకుండా అడ్డుకునే చట్టంగానే దాన్ని పరిమితం చేశారు. ఈ చట్టం ద్వారా సంక్రమించిన అధికారాలతో చెరువులు, కుంటలు, నాలాల వెంట వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలగించే అవకాశం ఉన్నప్పటికీ.. వాల్టా అథారిటీల ఏర్పాటులో నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఫలితంగా గత పదేండ్లలో ఆక్రమణలు పెరిగి చెరువులు, కుంటలు కుంచించుకుపోయాయి. నీటి వనరుల పరిరక్షణ, మట్టి, ఇసుక అక్రమ తవ్వకాల నివారణ, చెట్ల నరికివేత నిరోధం కోసం ఉమ్మడి ఏపీలో తీసుకొచ్చిన ఏపీ వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్ట్ - 2002ను తెలంగాణ వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్ట్ - 2002గా గత ప్రభుత్వం 2014లోనే అడాప్ట్ చేసుకుంది. ఇందులో ప్రధానంగా సెక్షన్ 23(1) ప్రకారం.. చెరువులు, కుంటలు, నాలాల వంటి నీటి వనరులను వారసత్వ వనరుగా , పరిరక్షణ ప్రాంతాలుగా గుర్తించి, వాటిని నిర్మించిన ఉద్దేశానికి భంగం కలగకుండా నిరోధించే అధికారం వాల్టా అథారిటీకి ఉంటుంది. అలాగే, చెరువులు, కుంటలు, నాలాలు, రిజర్వాయర్లు ఇతర నీటి వనరులపై సర్వే నిర్వహించి, శాశ్వత ప్రాతిపదికన హద్దులను గుర్తించడం, ఆక్రమణలను తొలగించడం, నిరోధించడం, నీటి వనరుల్లో కలుషితాలు, వ్యర్థాలు కలవకుండా చూడడం ఈ అథారిటీల బాధ్యత. కాగా, హైడ్రా బాధ్యతలను సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్ రంగనాథ్?కు అప్పగించిన తరహాలోనే నీటి వనరుల బౌండరీ గుర్తించి, ఆక్రమణలను నిరోధించే లేదా తొలగించే అధికారాన్ని వాల్టా అథారిటీకి కల్పించి.. ఎవరైనా ఆఫీసర్ అప్పగించాలని సర్కారు భావిస్తున్నట్టు తెలిసింది. ఈ చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర, జిల్లా, డివిజనల్, మండల స్థాయిలో తెలంగాణ వాటర్, ల్యాండ్ అండ్, ట్రీస్ అథారిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయి



అథారిటీ ఎక్స్ అఫీషియో చైర్ పర్సన్ గా రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, వైస్ చైర్ పర్సన్ గా చీఫ్ సెక్రటరీ వ్యవహరిస్తారు. ఎమ్మెల్యేలు, వివిధ శాఖల సెక్రటరీలు, ఎన్జీవో ప్రతినిధులు, నిపుణులు సహా 22 మంది సభ్యులుగా ఉంటారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా అసెంబ్లీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలను ప్రభుత్వం నామినేట్ చేయాలి. అందులో ఒకరు ప్రధాన ప్రతిపక్షానికి చెందిన ఎమ్మెల్యే ఉండాలి. రాష్ట్ర అగ్రికల్చర్, ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, రూరల్ వాటర్ సప్లై, పంచాయతీరాజ్, అటవీ, పర్యావరణ శాఖలకు చెందిన సెక్రటరీలతోపాటు ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ ఎక్స్ అఫీషియో మెంబర్లుగా వ్యవహరిస్తారు. వీరితోపాటు లైఫ్, ఎర్త్ సైన్సెస్, ఇంజినీరింగ్ డిపార్ట్ మెంట్లకు చెందిన ముగ్గురు ప్రొఫెసర్లు, నీరు, భూసారం ఆర్థిక రంగాల్లో ముగ్గురు నిపుణులను సభ్యులుగా నియమించాల్సి ఉంటుంది. అలాగే, సహజ వనరుల పరిరక్షణ కోసం పనిచేసే ఐదుగురు నాన్ అఫీషియల్ పర్సన్స్ ను సభ్యులు నియమించాలి. ఎస్సీ, ఎస్టీ, మహిళా కేటగిరీల నుంచి వీరిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఎక్స్ అఫీషియో మెంబర్ సెక్రటరీగా గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ వ్యవహరిస్తారు. ఇదే పద్ధతిలో జిల్లాస్థాయిలో వాల్టా అథారిటీ ఎక్స్ అఫీషియో చైర్ పర్సన్ గా కలెక్టర్, ఎక్స్ అఫీషియో మెంబర్ గా ఒక ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలు.. ఇందులో ఒకరు ప్రధాన ప్రతిపక్ష ఎమ్మెల్యే ఉంటారు. రాష్ట్ర స్థాయిలోలాగే జిల్లాలో కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. ఇలా వీరంతా కలసికట్టుగా సహజవనరులకు రక్షణగా చర్యలు తీసుకోవచ్చు.

## బీ అలెర్ట్ : అధికారులకు ఏపీ సీఎం ఆదేశం..

అమరావతి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. కొన్ని చోట్ల భారీ వర్షం కురుస్తోంది. వర్ష ప్రభావంతో జనం ఇళ్లలోనే ఉండిపోయారు. కొన్ని చోట్ల బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వర్షాలపై మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సహా ఆయా శాఖల అధికారులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలతో జనజీవనం ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వర్ష ప్రభావం మరో రెండు, మూడు రోజులు ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది. వర్ష ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. వర్షాలతో ఓర్వకల్లు పర్యటనను రద్దు చేసుకొని మరి సమీక్షిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. కొన్ని చోట్ల భారీ వర్షం కురుస్తోంది. వర్ష ప్రభావంతో జనం ఇళ్లలోనే ఉండిపోయారు. కొన్ని చోట్ల బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వర్షాలపై మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సహా ఆయా శాఖల అధికారులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 'మరో మూడు రోజులు వర్షం ప్రభావం ఉండనుంది. అప్రమత్తంగా ఉండాలని యంత్రాంగాన్ని ఆదేశించా. భారీ వర్షాలు, వరదల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తతో ఉంటే ప్రజల ఇబ్బందులను తగ్గించొచ్చు. ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ శాఖ సమన్వయంతో చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలి. పట్టణ ప్రాంతాల్లో రోడ్లపై భారీ స్థాయిలో నీరు చేరి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. పరిస్థితికి అనుగుణంగా ట్రాఫిక్ మళ్లింపు చేపట్టి, ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలి అని' అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం

'వర్షాలు, వరదల వల్ల తాగునీరు, ఆహారం కలుషితం అయ్యే అవకాశం ఎక్కువ ఉంది. అల్లూరి జిల్లాలో కలుషిత ఆహారం ఘటన జరిగింది. బాధితులకు మెరుగైన వైద్యసాయం అందించాలి. కలుషిత ఆహారం ఘటనకు గల కారణాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. సీజనల్ వ్యాధుల తీవ్రత దృష్ట్యా మరింత సమర్థవంతంగా పనిచేయాలని వైద్య శాఖ



అధికారులకు ఆదేశించా. ఏజెన్సీలో జ్వరాల బారిన పడిన గిరిజనులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలి. ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలు, వాగులు దాటేందుకు ప్రజలను అనుమతించవద్దు. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా వివిధ శాఖల అధికారులు నిత్యం సంప్రదింపులు జరుపుకుని సమన్వయంతో పనిచేయాలి. క్రైసిస్ మేనేజ్మెంట్ విషయంలో డ్రోన్లు వంటి టెక్నాలజీ వాడండి. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖ ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు వర్షాలపై సమాచారం ఇవ్వాలి. భారీ వర్షాలు, వరదలపై ఆయా ప్రాంతాల ప్రజల ఫోన్లకు అలెర్ట్ మెసేజ్ పంపించాలి. విపత్తు వచ్చిన సమయంలో ప్రభుత్వం తమకు ఆదుకుంటుందనే నమ్మకం వారికి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను నిరంతరం మానిటర్ చేయాలి.సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు అవసరమైన నిధులు విడుదల కోసం ఆదేశాలు ఇచ్చా. ప్రాజెక్టుల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తాం. అధికారులు బాధ్యతగా ఉండాలి అని' సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు.

మూడు రోజుల్లో పెన్షన్ల పంపిణీ పూర్తి

'పెన్షన్ల పంపిణీ విషయంలో సచివాలయ ఉద్యోగులకు వెసులుబాటు ఇచ్చాం. రేపు సెలవు కాబట్టి ముందు రోజే పెన్షన్లు ఇవ్వాలని చూశాం. భారీ వర్షాల వల్ల పెన్షన్ల పంపిణీ సమయం పెంచాం. వచ్చే రెండు మూడు రోజుల్లో సచివాలయ ఉద్యోగులు పెన్షన్ల పంపిణీని పూర్తి చెయ్యవచ్చు. వర్షాలు లేని ప్రాంతాల్లో యధావిధిగా పెన్షన్ల పంపిణీ కొనసాగుతుంది. విజయవాడలో కొండచరియలు విరిగి ఇంటిపై పడిన ఘటన బాధ కలిగించింది. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది అని' సీఎం చంద్రబాబు ప్రకటన చేశారు.

## వైసీపీని వీడుతారన్న వార్తలపై తొలిసారిగా స్పందించిన రోజా..



తిరుమల: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలయ్యాక మాజీ మంత్రి రోజా అడ్రస్ లేకుండా పోయారు. ఇటీవలి కాలంలో రోజా పార్టీ మారుతారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఏపీ రాజకీయాలకు శాశ్వతంగా గుడ్ బై చెప్పనున్నారని.. తమిళనాడులో విజయ్ పార్టీలో చేరతారని టాక్ నడుస్తోంది. దీనిపై తొలిసారిగా ఆమె స్పందించారు. తిరుమల శ్రీవారిని రోజా ఇవాళ దర్శించుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తాను పార్టీ మారుతానని జరుగుతున్న ప్రచారం ఊహాగానమేనన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో మహిళలపై జరిగిన ఘటనల పట్ల ప్రభుత్వం సిగ్గు పడాలన్నారు.ముచ్చుమర్రిలో ఘటన జరిగి 60 రోజులు అవుతున్నా ఆ పాప శవాన్ని ఇంకా కనిపెట్టలేకపోయారని విమర్శించారు. గుడ్లవల్లేరులోని హాస్టల్‌లో హిడెన్ కెమెరాలు పెట్టారంటూ విద్యార్థులు ఫిర్యాదు చేసినా ఏమి జరగలేదని ఎస్పీ చెప్పడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వ హయంలో ర్యాగింగ్ విపరీతంగా పెరిగిందన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం అమలు పైన పెట్టిన దృష్టిని పక్కన పెట్టి.. ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంపై దృష్టి సారించాలని రోజా విమర్శించారు. పార్టీలు మారే వారిని ప్రజలు విశ్వసించరని అన్నారు ఎంత మంది పార్టీని వీడినా వైసీపీకీ వచ్చిన నష్టం ఏమీ లేదన్నారు. మంత్రిగా ఉన్న సమయంలో రోజా వారానికోసారి తిరుమలను దర్శించుకునేవారు. పైగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నప్పుడల్లా రాజకీయ విమర్శలను ఎక్కుపెడుతూనే ఉండేవారు.అప్పట్లో రోజాపై తిరుమలలో చేస్తున్న రాజకీయ విమర్శలపై విపరీతంగా ట్రోల్స్ వచ్చాయి. అయినా సరే రోజా ఇప్పటికీ తన తీరును మాత్రం మార్చుకోలేదు. ఓటమి పాలయ్యాక మాత్రం తిరుమలకు రోజా పెద్దగా వచ్చిందే లేదు. ఇన్నాళ్లకు వచ్చి కూడా ఆమె రాజకీయ విమర్శలకు పాల్పడటం పట్ల భక్తుల నుంచి.. రాజకీయ పార్టీల నుంచి ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఒక వైపు భారీ వర్షాల కారణంగా రాష్ట్రమంతా అతలాకుతలమవుతుంటే దానికి సంబంధించి ఊసే లేదు కానీ రాజకీయ విమర్శలేంటని మండిపడుతున్నారు. రోజా ఓటమి పాలైనా కూడా ఆమెకు వివరం మాత్రం రాలేదని అంటున్నారు. మొత్తానికి రోజా అయితే పార్టీ మారే అవకాశమే లేదని తేల్చి చెప్పేశారు.

## మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు ఆందోళనకరం..



న్యూఢిల్లీ,దేశంలోని మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఇలాంటి కేసుల్లో సత్వర న్యాయం జరగాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఇది వారి భద్రతకు మరింత భరోసానిస్తుందన్నారు.భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ సమక్షంలో జరిగిన జిల్లా న్యాయవ్యవస్థ జాతీయ సదస్సు ప్రారంభ సెషన్‌లో ప్రధాని మోదీ పాల్గొని మాట్లాడారు. న్యాయవ్యవస్థలపై ప్రజలు ఎన్నడూ అపనమ్మకం చూపలేదన్నారు. ఇక ఇదే సదస్సులో దేశంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి ప్రస్తావించారు. మహిళపై అఘాయిత్యాలు, పిల్లల భద్రత సమాజానికి తీవ్ర ఆందోళన కలిగించే విషయాలని అన్నారు.'మహిళలపై అఘాయిత్యాల కేసుల్లో ఎంత వేగంగా న్యాయం జరుగుతుందో.. అప్పుడే వారి భద్రతపై ఎక్కువ భరోసా ఏర్పడుతుంది. దేశంలో మహిళలకు భద్రత కల్పించేందుకు ఇప్పటికే అనేక కఠినమైన చట్టాలు ఉన్నాయి. ఇలాంటి కేసుల్లో వేగంగా విచారణ పూర్తి చేసి శిక్షలు విధించాలి. 2019లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు చట్టాన్ని తీసుకొచ్చాం. ఈ చట్టం కింద సాక్షులను రక్షించే కేంద్రాలను ఏర్పాటు చేశాం. జిల్లా పర్యవేక్షక బృందాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వీటిని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. అప్పుడే మహిళలపై నేరాల విషయంలో వేగంగా తీర్పులు వెలువడతాయి' అని ప్రధాని మోదీ అన్నారు.

## ముసురులో జంట నగరాలు..

హైదరాబాద్:హైదరాబాద్ తో పాటు తెలంగాణలోని పలు జిల్లాలలో ఉదయం నుంచి వర్షం కురుస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బంజారాహిల్స్, బంజారాహిల్స్, లక్డీకపూల్, నాంపల్లి, కోఠి, అమీర్ పేట, పంజాగుట్ట, ఖైరతాబాద్, మెహిదీపట్నం, మలక్ పేట, దిల్ సుఖ్ నగర్, హయత్ నగర్, వనస్థలిపురంలో వర్షం కురుస్తోంది.పలు ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోయింది. వర్షం కారణంగా అక్కడక్కడా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మరోవైపు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ఏర్పడింది. ఇవాళ (శనివారం) మేఘావృతమై ఉండే అవకాశం ఉంది..అరేబియా సముద్రంలో అస్నా తుఫాన్.. భారత్?కు ఐఎండీ అలర్ట్..దీని ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు



అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ అధికారులు సూచించారు..నైరుతి రుతుపవనాలు సెప్టెంబర్ నెలాఖరు వరకు కొనసాగే అవకాశం ఉన్నందున అక్టోబర్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. , సెప్టెంబర్ మరియు అక్టోబర్లలో రుతుపవనాల వర్షాలు లా నినా వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉంటాయి. రుతుపవనాల తిరోగమన సమయంలో లా నినా అభివృద్ధి చెందితే, అది ముగియడానికి చాలా సమయం పడుతుంది.ఫిలిప్ క్యాపిటల్ ఇండియా కమోడిటీస్ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ అశ్విని బన్సోద్ మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 3-4 వారాలు , అక్టోబర్ ప్రారంభంలో భారీ వర్షాలు కురిస్తే ఇప్పటికే చేతికి వచ్చిన పంటలకు , పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు.

## సంపాదకీయం

**ఆదివారం 01-09-2024**

# మేధావులు ఏమైపోయినట్టు?

ఇంతకీ ఎవరు మేధావులు? బాగా చదువుకొని పీహెచ్‌డీ పట్టా పొందినవారా? సామాజిక స్పృహతో సమాజంలో ఉన్న, సమాజానికి పట్టిన రుగ్మతలను ఎలా నయం చేయాలనే సంకల్పం గలవారా? అలాంటి రుగ్మతలను కలిగిఉన్న, వ్యాధిగ్రస్తమైన అవయవానికి లేదా వ్యక్తికి ఇక మందులు పనిచెయ్యవు, శస్త్ర చికిత్స ఒక్కటే మార్గమని, అవయవ ఛేదనే దానికి సరైన చికిత్స అని నిర్ణయం తీసుకునేవారా? లేదా ఒక వ్యవస్థకు, ఒక వ్యక్తికి బందీ అయిపోయి వారి వ్యతిరేక వర్గాన్ని పొద్దునలేచిన దగ్గర్నుంచి విమర్శిస్తూ (తిడుతూ) బాగుపడేవారా? (బతకనేర్చినవారా?). వీరిలో ఎవరు మేధావులు? ఒక దృశ్య మాధ్యమం వారి వ్యతిరేకులను ఎలా ఉతికిపారేసిందో మొన్నటివరకు మనం చూశాం. అలాంటి వ్యతిరేకులను కూడా మనం ఇంకా చూస్తున్నాం.నేతన్నలకు ఒక పథకం, దళితులకు ఒక పథకం, గొల్లకుర్మవారికి ఒక పథకం అంటూ సమాజానికి ఏదో చేయబోతే.. గడీల పాలన, దొరల పాలన అంటూ కల్లబొల్లి మాటలతో ఊదరగొట్టిన నోర్లు ఇప్పుడెందుకు మూతబడ్డాయో మరి! మేధావుల మెదళ్లలో ఉన్న తెలివి అయిపోయిందా, లేక మేత మేస్తున్నా యా? ధర్మాన్ని మరిచి స్వార్థమొక్కటే రాజ్యమేలితే ఇటువంటి ఫలితాలే కనిపిస్తాయి.తెలంగాణను పొద్దునలేచిన దగ్గర్నుంచి సాయం త్రం దాకా ఏ మాధ్యమం దొరికితే ఆ మాధ్యమంలో వారి పోషకులకు అనుకూలంగా ఉతికివేయడం, ఇప్పటికీ ఆ వాకిరేవు ఇంకా నడుస్తుండటం కూడా చూస్తున్నాం. మేధావులంటే వీరేనా? కావొచ్చు. కాకపోతే నానారకాల ప్రజలకు నానా రకాల పథకాలను రచించి, నిరంతరం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఆలోచించినవారిని.. మాధ్యమాల్లో ఊదరగొట్టి దించేసేదాక వదల్లే దు కదా! ఆ మేధావుల మూతులు కొన్ని ఇప్పుడు మూతపడ్డాయి. ఎందుచేత? అది వారికి తెలుసు, మనకు తెలుసు. ఇక్కడో రకం మేధావులున్నారు.నేతన్నలకు ఒక పథకం, దళితులకు ఒక పథకం, గొల్లకుర్మవారికి ఒక పథకం అంటూ సమాజానికి ఏదో చేయబోతే.. గడీల పాలన, దొరల పాలన అంటూ కల్లబొల్లి మాటలతో ఊదరగొట్టిన నోర్లు ఇప్పుడెందుకు మూతబడ్డాయో మరి! మేధావుల మెదళ్లలో ఉన్న తెలివి అయిపోయిందా, లేక మేత మేస్తున్నా యా? ధర్మాన్ని మరిచి స్వార్థమొక్కటే రాజ్యమేలితే ఇటువంటి ఫలితాలే కనిపిస్తాయి.సమాజానికి ధర్మం చెప్పి, ధార్మిక చింతన నేర్పే కర్తవ్యమున్నవారు ఇంకొక రకం మేధావులు. వారి మేధాన్ని అమ్మకానికి పెట్టారా? మరి చేతి ఐదు వేళ్లకు ఐదు ఉంగరాలు కావా లి, మెడలో బంగారు హారాలు కావాలి, ముం జేతి కడియాలు కావాలి. అయినా సమాజమంతా అలానే పోతుంటే వారు మాత్రం ఏం చేస్తారు? కానీ, నాకొక అనుమానం. సమాజంలో వీటిని ధరిస్తేనే వస్తుందా? గతంలో మహామహోపాధ్యాయుల్ని చూశాం, పుంభావ సరస్వతుల్ని చూశాం. వారికి ఏం లేవు. వారిప్పుడు లేకున్నా వారిని తలుచుకుంటున్నాం. ఇదిగో మేధావులు ఒక్కడున్నారు. 'నాకిదివ్వు, నీకిదిస్తా' అనే ఒక రకం మేధావి వర్గం దేవునితో బేరమాడుతూ, ఆయన ఇంటర్వ్యూ కోసం వెంపర్లాడుతూ దేవాలయాలను నింపుతున్నారు.ఇదొక రకం మేధావివర్గం. ఇదిగో ఇక్కడుంది. చాలా రోజుల కింద ఒక కవిత చదివాను. దాని కింద రాసిన కామెంట్ వల్ల జ్ఞాపకం వస్తూ ఉంటుంది. పుచ్చిపోయిన సమాజాన్ని విమర్శించిన కవిత కింద ఒక మేధావి రాసిన కామెంట్ ఇలా ఉంది. 'కవిత బాగుంది! చదువుకోవడానికి హాయిగా ఉంది. యతిప్రాసలు, భాష అద్భుతం. కానీ, ఆయన వివరించిన సమస్యకు జవాబు లేదు. ఆ సమస్యను ఎలా పరిష్కరించాలి? ఎవరు పరిష్కరించాలి? చెప్పలేదు. కవితాప్రియులు చదివి అనుభవించారు. అంతే, మరిచిపోయారు. కొందరు పాపం! సమస్యల్ని పరిష్కరిద్దామని సమాజంలో ఉంటూ కాదు, అడవిలో ఆలోచిద్దామని అడవికి వెళ్లారు. ఏదేదో చేశారు. ఏమైంది. కొన్ని రుగ్మతలు వారికంటుకొని కనుమరుగయ్యారు. మానవులకున్న సహజ బలహీనతలు కొందర్ని బలిచేశాయి. కొందరు చట్టానికి బలైపోయారు. ఇదొక రకం మేధావి వర్గం.ఒక పెగ్గు వేసి, ఒక సిగరెట్ వెలిగించి కొందరు మేధావులు అర్థవంతమైన కవితలు వెలువరించారు (నిజంగా బాధతోనే కావొచ్చు). కానీ, అవి కాలగర్భంలో కలిసిపోయాయి. వారూ వెళ్లిపోయారు. కానీ, సనాతన కావ్యాలు రామాయణం, భారతాలు కనుమరుగు కాలేదు. అవి నిత్యనూతనంగా (కొందరికి) వెలుగుతూనే ఉన్నాయి. కొందరికి అధికార పీఠమెక్కడానికి సోపానాలుగా కూడా పనికొస్తున్నాయి. అవి కనుమరుగు కాకపోవడానికి కారణం అందులో సమాజ రుగ్మతలను వర్ణిస్తూ వాటి నివారణకు, చికిత్సలకు మార్గాల్ని కూడా చూపిస్తున్నాయి. ఇదీ కారణం. మరి వీటిని విరివిగా ప్రచారం చేద్దామని ఎవరికైనా తడుతున్నదా? (ప్రచారం చేసే కర్తవ్యమున్న మేధావులు దీనికి జవాబులు చెప్తారా?) ఇదొక రకం మేధావి వర్గం.రాజమండ్రిలో గోదావరి ఆనకట్టను కట్టిన కాటన్ దొర పేరును ఇప్పటికీ చాలామంది తలుచుకుంటారు. కొందరైతే నిత్య పూజలో ఆయన పేరును చేర్చి సంకల్పం చెప్పుకుంటారట. 'కావేరి వర్ధతాం, గోదావరి వర్ధతాం, కాటన్ దొర వర్ధతాం, కాలేవర్షతు వాసవా శ్రీరంగనాథో జయతు శ్రీరంగవర్ధతాం' అంటూ. వీరు తెలివికలవారు కానీ, మేధావులు కారు.

మరి మన మేధావులు 'కావేరి వర్ధతాం! కాళేశ్వరం వర్ధతాం, కేసీఆర్ వర్ధతాం, కాలేకాలేవర్షతు వాసవా' అంటూ సంకల్పం చేస్తారా? ఎందుకు చేయరు? 'తొక్కేస్తాం, బొంద పెడతాం, పేరు లేకుండా చేస్తాం' అంటే సంక ల్పం మాత్రం చెప్తారు. ఎందుకంటే, వీరు 'కావేరి వర్ధతాం, కాళేశ్వరం వర్ధతాం, కేసీఆర్ వర్ధతాం' అని అంటే ఇంకేమన్నా ఉందా? అబ్బో బ్రహ్మాండం బద్దలైపోదు!ఆశలు తప్ప, ఆశయాలకు దూరమైపోతే మేధోసంపత్తి ఇలానే భ్రష్టుపడుతుంది. ఇక యువ మేధావులు.. వారి ఆశలు ఎలా అయి నా నెరవేరాలి తప్ప, ఇంకో మార్గం లేదంటారు. అయితే ఎదుటివారిని చంపుతారు, లేదా వారే ఆత్మహత్య చేసుకుంటారు. వీరితో మాట్లాడి వారిని సముదాయపరిచే వయసు మళ్లిన మేధ ఎక్కడుంది? తల్లిదండ్రులైతే వారి యువత జీవితంలో స్థిరపడితే చాలంటారు. ఆ తర్వాత వారు (యువత) ఎదుర్కొనే సమస్యలను మొదట వారికి చెప్పి, వాటిని ఎదుర్కొన్నప్పుడు ఎలా పరిష్కరించుకోవాలంటే చెప్పే సోయి ఎంతమంది పెద్దలకుంది? మొదట జీవితం గురించి చెప్పి (ఇది అందరికీ వడ్డించిన విస్తరి కాదని) ఆ తర్వాత పరికర్త వ్యం గురించి వివరించి, కొంత ధర్మం గురించి చెప్పి వారిని సమాజంలో వదిలిపెడితే యువత ఇంత ఒత్తిడిని ఎదుర్కోదు. కానీ, చెప్పే వారెవ్వరు? వారిని, వారి ఉద్రేకాన్ని రెచ్చగొట్టి తమ స్వార్థం కోసం వాడుకునేవారు కొందర, వారి బాధలను అర్థం చేసుకోకుండా 'ఎందుకు?, బలిసి, ఒళ్లు పొగరని, తెలివితక్కువని' రకరకాలుగా కామెంట్‌లు చేసేవారే అధి కం కాదా? ఒక్కసారి సమాజంలోకి వెళ్లండి. ఎన్ని కుటుంబాలు సంతోషంగా ఉన్నాయో సర్వే చేయండి. ఆర్థికంగా బాగానే ఉంటారు. కానీ, సంతోషంగా ఎందరున్నారు? అసలు సంతోషం, సుఖం, ఆనందం అన్న భావాల్లో తేడా ఎంతమందికి తెలుసు. ఈ విషయమై మేధావులు ఆలోచించారా?

# బొగ్గుగనులపై అదానీ ఆధిపత్యం!

న్యూఢిల్లీ,భారత దేశంలో బొగ్గుకి ప్రత్యేక స్థానం ఉంది. దేశ పారిశ్రామిక ఉత్పత్తికి అవసరమైన కరెంట్ ఉత్పత్తి చేసే థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గే ఆధారంగా ఉంది. అంతటి ప్రాధాన్యత గల బొగ్గు ఉత్పత్తి ప్రభుత్వ సంస్థల నుంచి ప్రైవేట్ సంస్థల చేతుల్లోకిపోతున్నది. ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉన్న బొగ్గు గనులన్నీ ప్రైవేట్ సంస్థల పరమవుతున్నాయి. ఫలితంగా బొగ్గు కొరత ఏర్పడి అధికరేటుకి ప్రభుత్వ ఆధ్వర్యంలోని విద్యుత్ సంస్థలు బొగ్గును ప్రైవేట్ సంస్థల నుంచి కొనుగోలు చేస్తున్నాయి. అదానీ ఎంటర్ ప్రైజెస్ దేశంలోనూ, విదేశాల్లో పాలక ప్రభుత్వాల అండతో బొగ్గు గనులను సొంతం చేసుకుంది.ఎన్‌డిఎ ప్రభుత్వం వేసిన బొగ్గు గనుల వేలంలో అదానీ గ్రూపే మోడీ అండతో ఎక్కువ గనులను పొందింది. బొగ్గు బ్లాకులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రత్యేక నిబంధన సరికాదని, పారదర్శకత లోపించిందని ప్రధాని మోడీ కార్యాలయం నిర్ధారించిన తర్వాత కూడా ఆయన ప్రభు త్వం ప్రైవేట్ సంస్థలకు మినహాయింపులు ఇచ్చింది. మోడీకి అత్యంత ఆత్మీయుడైన అదానీ కోసమే ఈ మినహాయింపు కాబట్టి, అదానీ గ్రూపుకి దట్టమైన అటవీ ప్రాంతా ల్లో కూడా 450 మిలియన్ టన్నుల కన్నా ఎక్కువ బొగ్గు కలిగి ఉన్న ప్రాంతంలో కూడా తవ్వకానికి అనుమతించింది. ఇలాంటి అనుమతుల వలన అటవీ ప్రాంతాలకు, గిరిజనులకు తీవ్రనష్ట జరుగుతుంది.అదానీ ఎంటర్ ప్రైజెస్ గ్రూపు బొగ్గు గనుల ప్రాజెక్టులకు వ్యతిరేకంగా అనేక ప్రాంతాల్లో అటవీ గ్రామాల గిరిజనులే కాకుండా అటవీ పక్క గ్రామాల ప్రజలు కూడా ఆందోళన చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో ధీరౌలీ బొగ్గు గని అతి పెద్దది. దీని విస్తీర్ణం 2,672 తో అడవులు, పొలాలు, గ్రామాలతో విస్తరించి ఉంది. 558 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఈ బ్లాక్ అదానీ గ్రూపు అనుబంధ సంస్థ స్ట్రాటాటెక్ మినరల్ రీసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధీనంలో ఉంది. ఈ బ్లాక్ నుంచి సంవత్సరానికి 6.5 మిలియన్ టన్నుల బొగ్గు తీసేందుకు, అందులో 90% వరకు అదానీ బొగ్గు విద్యుత్ కేంద్రానికి ఇవ్వడానికి పర్యావరణ ఆమోదంతో భారత ప్రభుత్వం అదానీ కంపెనీకి అందించింది.ఈ గని లో బొగ్గు తవ్వకం వల్ల గిరిజనుల భూములు, అడవి, పొలాలు నాశనం చేయబడతాయి.ఇప్పటికే బొగ్గు రవాణా వలన ఆ ప్రాంతంలోని అనేక గ్రామాల్లో పర్యావరణ సమస్యలు ఏర్పడ్డాయి. ధీరౌలీ బ్లాక్ నుంచి బొగ్గు తీసేందుకు భారీగా అటవీ ప్రాంతాన్ని నిర్మూలించేందుకు అదానీ సంస్థ సిద్ధంగా ఉన్న సమయంలో అందుకు పర్యావరణ అనుమతి లభించటం గమనార్హం. అదానీ కంపెనీకి వ్యతిరేకంగా అటవీ, భూములను కాపాడుకునేందుకు ప్రజలు ఆందోళనలు కొనసాగిస్తున్నారు.చత్తీస్‌గఢ్‌లోని హరిహర్ పుర్ గ్రామం రెండు భిన్న ప్రపంచాల మధ్య ఉన్నట్లు ఉంటుంది.తూర్పు వైపున దశాబ్దాల నాటి పార్సా ఈస్ట్ కాంటా బేసిన్ (పిఇకెబి) ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఉంది.కంటిచూపు మేర కన్పించే ఈ గని అదానీ గ్రూపు చేతికి దక్కింది. మరోవైపున 'హస్‌దేవ్' అటవీ ప్రాంతంలో బిలియన్ టన్నుల బొగ్గు ఇంకా భూమిలో మిగిలే ఉంది. మధ్య భారతంలోని దట్టమైన అటవీ ప్రాంతాల్లో 'హస్‌దేవ్' కూడా ఒకటి. దాని విస్తీర్ణం లక్షా 70 వేల హెక్టార్లగా ఉంది. ఈ ప్రాంతం చత్తీస్‌గఢ్‌కి గుండెకాయగా పేర్కొంటారు. ఇక్కడ తలపెట్టిన కొత్త బొగ్గు గని ఏర్పాటును గత పది ఏళ్లగా గిరిజనులు, అటవీ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. కొత్త గని గిరిజనుల పైనా, అడవి పైనా చెడు ప్రభావం చూపుతుందని అటవీ పరిశోధన సంస్థ హెచ్చరిక చేసినా 2022 చత్తీస్‌గఢ్ ప్రభుత్వ ఈ గనిలో బొగ్గు బయటకు తీయటానికి అదానీ గ్రూపుకి అనుమతి ఇచ్చింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు.ప్రతి వారం వందలాది మంది గిరిజనులు దీక్షా శిబిరానికి వచ్చి అదానీ గో బ్యాక్ అంటున్నారు. ఈ కొత్త బొగ్గు గని విస్తరణ కోసం అడవులను నాశనాన్ని ఎదుర్కోవటానికి 'హస్ దేవ్' అరణ్య బచావో సంఘర్షణ సమితి ప్రజలను సమీకరిస్తుంది. ప్రజాభిప్రాయ సేకరణ కోసం గ్రామసభలు జరుపుతున్నట్లు చెబుతూ మరొక వైపు గిరిజన ప్రజలు రాకుండా పోలీసులచే బారికేడ్లు నిర్మించి పహారాపెట్టారు. అయినా ప్రజలు పర్సా గని విస్తరణకు వ్యతిరేక నినాదాలు చేశారు. గ్రామసభల దొంగ ఆమోద పత్రాలను బట్టబయలు చేశారు. గని విస్తరణకు వ్యతిరేకంగా చలో రాజధానికి అంటూ 300 కి.మీ. పాదయాత్రను ప్రజలు కొనసాగిస్తున్నారు.బిజహాన్ బొగ్గు గని: ఇది ఒడిశా రాష్ట్రంలోని రూర్కెలా ప్రాంతంలో ఉంది. ఈ బొగ్గు గని కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం మార్చి 2022లో నిర్వహించిన బిడ్‌లో అదానీ గ్రూపు అనుబంధ సంస్థ మహానది మైన్స్ మినరల్ ప్రైవేట్ సంస్థ దక్కించుకుంది. ఈ గని బ్లాక్ కింద 604.64 హెక్టార్లలో బొగ్గు తవ్వకం




జరుగుతున్నది. ఈ గని తవ్వకం వల్ల సుందర్ ఘర్ జిల్లాలోని బిజహాన్, జార్పాలం, గిరిసీమి, భోగ్రాకచర్ గ్రామాలు ప్రభావితమై 450 కుటుంబాలు నిర్వాసితులు అవుతారు. గని వల్ల ప్రభావిత గ్రామస్థులు మైనింగ్ ప్రాజెక్టు కొనసాగించడానికి ముందు గ్రామ సభ ఆమోదం పొందాలని డిమాండ్ చేస్తున్నారు. మెరుగైన పునరావాసం, భూములకు న్యాయపరమైన కొత్త భూ పరిహారం, ఆర్‌అండ్ ఆర్ ప్రయోజనాలను పెంచాలని ప్రభావిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వీటిని నెరవేర్చే దాకా పనులు చేపట్టరాదని భోగ్రాకచర్ గ్రామంలో డ్రోన్ సర్వే చేపట్టకుండా అదానీ కంపెనీ అధికారులను ప్రజలు అడ్డుకున్నారు.మహా జన్‌కో తో ఒప్పందం: భారత దేశంలోని గారే పాల్మా సెక్టార్ 2 బొగ్గు గని కోసం మహారాష్ట్ర పవర్ జనరేషన్ కంపెనీ తో అదానీ ఎంటర్ ప్రైజెస్ కొత్త బొగ్గు గనుల ఒప్పందం చేసుకుంది. గారే పాల్మా సెక్టార్ 2 బొగ్గు గనిని భారత బొగ్గు మంత్రిత్వ శాఖ 2015లో మహారాష్ట్ర జెన్‌కో కి కేటాయించింది. 2016లో ఈ బొగ్గు గని కోసం గని డెవలపర్ కోసం బొగ్గు శాఖ టెండర్ ప్రకటించింది. రివర్స్ టెండర్ ద్వారా అదానీ ఎంటర్‌ప్రైజెస్ గనిని దక్కించుకుంది. దీని కాంట్రాక్ట్ 34 సంవత్సరాలు. ఈ గని నుంచి సంవత్సరానికి 23.6 మిలియన్ మెట్రిక్ టన్నుల గరిష్ఠంగా బొగ్గును తీసే సామర్థ్యం కలిగి ఉంది. ఈ గని అదానీ గ్రూపుపరం కావటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలూ సహకరించాయి. ప్రభుత్వాల సహకారంతో ప్రభుత్వ రంగ బొగ్గు గనులను అదానీ గ్రూపు స్వాధీనం చేసుకుంటున్నది.అదానీ గ్రూపు మోసాలు: బొగ్గు గనుల లీజుల్లో ఎన్నో విమర్శలు ఎదుర్కొంటున్న అదానీ ఎంటర్‌ప్రైజెస్ బొగ్గు విక్రయాల్లో కూడా అక్రమాలకు పాల్పడింది. నాణ్యతలేని బొగ్గు కారుచౌకగా కొనుగోళ్ల చేసి దాన్ని హైగ్రేడ్ బొగ్గుగా నమ్మించి ఎక్కువ ధరకు విక్రయించింది. 2014లో ఇండోనేసియా నుంచి 69,925 టన్నుల నాణ్యత లేని బొగ్గును అదానీ కంపెనీ కొనుగోలు చేసింది. దీని ధర చాలా తక్కువ. ఈ బొగ్గును హైగ్రేడ్ క్వాలిటీ బొగ్గుగా ధ్రువీకరించి తమిళనాడు ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న టిఎఎన్ జిసిఒ విద్యుత్ సంస్థకు మూడు రెట్లు అధిక ధరకు పెంచి అమ్మింది. ఇలా ప్రభుత్వరంగ విద్యుత్ సంస్థల నుంచి దాదాపు రూ. 3 వేల కోట్లు దోచుకున్నది. దీన్ని ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ అంతర్జాతీయ పత్రిక టైమ్స్ కథనాల్లో వెల్లడించింది. అదానీ బొగ్గు అక్రమాలు ప్రజలపై ఆర్థిక భారం మోపటమే కాకుండా వారి ప్రాణాలను కూడా ప్రమాదంలో పడుతున్నాయని పర్యావరణ నిపుణులు మండిపడుతున్నారు.అదానీ గ్రూపు బొగ్గు అక్రమాలు ఎనిమిది సంవత్సరాలకు పూర్వమే ప్రారంభమైనాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటల్ జెన్సీ (డిఆర్ఐ) అదానీ సంస్థల అక్రమాలను గుర్తించింది. ఇండోనేసియా నుంచి బొగ్గు దిగుమతి చేసుకుంటూ దేశంలో బొగ్గు కృత్రిమ కొరతను సృష్టిస్తూ, దాన్ని విదేశాలకు డబ్బులు తరలించే మార్గంగా ఎంచుకున్నారని 2016లో అదానీతో సహా 40 మందికి డిఆర్ఐ నోటీసులు ఇచ్చింది. పోర్టుల్లో దిగుమతైన బొగ్గుకు చూపించిన ధరల్లో 50 శాతం తక్కువ ధరకి కొనుగోలు చేస్తున్నారని, బొగ్గుతో తయారైన విద్యుత్‌ను అధిక ధరలకు అమ్ముకొంటున్నారని ఆరోపించింది. డిఆర్ఐ దర్యాప్తును ఆపి వేయాలని బాంబే హైకోర్టు నుంచి అదానీ గ్రూపు స్టే తెచ్చుకుంది.భారతదేశంలోని అనేక బొగ్గు గనులతో పాటు ఆస్ట్రేలియాలోని క్వీన్స్ లాండ్ లో 'కార్మైకేల్' బొగ్గు గని, ఇండోనేసియాలో రెండు బొగ్గు గనుల్లో 74% వాటా అదానీ ఎంటర్‌ప్రైజెస్ కలిగి ఉంది. అదానీకి చెందిన ఇండోనేసియా గనుల నుంచే భారతదేశం ఎక్కువగా బొగ్గును దిగుమతి చేసుకుంటున్నది. అదానీ బహుళజాతి ఎంటర్‌ప్రైజెస్ సంస్థ బొగ్గు గనుల కోసం అనుసరిస్తున్న అక్రమ మార్గాలను, మోసాలను, అది సృష్టిస్తున్న అడవుల, పర్యావరణ వినాశనాన్ని, గిరిజనుల జీవితాలను కల్లోలభరితం చేయటాన్ని, అదానీకి మోడీ ఇస్తున్న సహకారం విరమించాలని దేశ ప్రజలు ఉద్యమించాలి.

# మోడీపై అవమానకర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,పధాని నరేంద్ర మోదీపై శశిథరూర్ చేసిన అవమానకర వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో ఢిల్లీ హైకోర్టు ఆయనకు గట్టి షాకిచ్చింది. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌పై దాఖలైన పరువు నష్టం కేసు విచారణను రద్దు చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. దీంతో పాటు కాంగ్రెస్ నేత శశిథరూర్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించడంతో పాటు గతంలో ఉన్న నిషేధాన్ని కూడా ఎత్తివేయాలని ఆదేశించింది. కాంగ్రెస్ నాయకుడు శశి థరూర్ 2018 సంవత్సరంలో ప్రధాని మోదీని 'శివలింగంపై తేలు' అని వ్యాఖ్యానించారు. శశిథరూర్ చేసిన ఈ వివాదాస్పద వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బీజేపీ నేత రాజీవ్ బబ్బర్ థరూర్‌పై పరువు నష్టం కేసు వేశారు. ఈ కేసులో ఢిల్లీ హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ఈ క్రమంలోనే బీజేపీ నేత రాజీవ్ బబ్బర్ తనపై వేసిన పరువు నష్టం కేసును కొట్టివేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గతంలో ఈ కేసులో దిగువ కోర్టులో జరుగుతున్న విచారణలపై ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. అంతేకాదు 2019 ఏప్రిల్ 27న కింది కోర్టు శశిథరూర్‌కు జారీ చేసిన సమన్లపై కూడా హైకోర్టు స్టే విధించింది. అయితే ఇప్పుడు కోర్టు శశిథరూర్ పిటిషన్‌ను తిరస్కరించింది. స్టేను కూడా ఎత్తివేసింది.మోదీ శివలింగంపై కూర్చున్న తేలులాంటివాడని ఓ ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన ఓ జర్నలిస్టు చెప్పారని శశిథరూర్ అన్నారు. మీరు వాటిని మీ చేతితో తీసివేయలేరు. వాటిని చెప్పులతో కొట్టలేరు. తేలును తాకేందుకు ప్రయత్నిస్తే కుట్టిస్తేయని, శివలింగాన్ని చెప్పుతో కొడితే విశ్వాసంలోని పవిత్ర సూత్రాలన్నీ బలహీనపడతాయని థరూర్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేత రాజీవ్ బబ్బర్ పరువు నష్టం కేసు దాఖలు చేశారు. థరూర్ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడి వ్యాఖ్యలు మతపరమైన మనోభావాలను దెబ్బతీసాయని అన్నారు. రాజీవ్ బబ్బర్ తన ఫిర్యాదులో శివ భక్తుడినని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో థరూర్ కోట్లాది మంది శివ భక్తుల మనోభావాలను విస్మరించి వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం భారతదేశంలో అనేక మంది భక్తుల ఆగ్రహానికి కారణమైందన్నారు. దేశం వెలుపల ఉన్న శివ భక్తులందరి మనోభావాలను దెబ్బతీసిందని వెల్లడించారు. దీంతో కాంగ్రెస్ ఎంపీపై ఫిర్యాదు దాఖలైంది.

# హర్యానా మాజీ సీఎం హూడాకు షాక్

న్యూఢిల్లీ,హర్యానా మాజీ ముఖ్యమంత్రి భూపేంద్ర సింగ్ హుడా కేసు విషయంలో ఈడీ కీలక చర్యలు తీసుకుంది. హుడా, ఎమ్మార్, ఇతర నిందితులపై మనీలాండరింగ్ కేసులో రూ.834 కోట్ల విలువైన ఆస్తులను దర్యాప్తు సంస్థ అటాచ్ చేసింది. ఈ ఆస్తులు గురుగ్రామ్, ఢిల్లీలోని 20 గ్రామాలలో ఉన్నాయి. చౌక ధరలకు భూమిని లాక్కున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ప్రజలకే కాకుండా ప్రభుత్వానికి కూడా నష్టం వాటిల్లిందని అంటున్నారు. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఈ ఎఫ్ఐఆర్‌లో అప్పటి హర్యానా ముఖ్యమంత్రి భూపేంద్ర సింగ్ హుడా, అప్పటి డీటీసీపీ డైరెక్టర్ త్రిలోక్ చంద్ గుప్తా, ఎంఎస్ ఎమ్మార్ ఎంజీఎఫ్ ల్యాండ్ లిమిటెడ్, 14 ఇతర వలసదారుల కంపెనీలపై చర్యలు తీసుకున్నారు. ఎమ్మార్ ఇండియా లిమిటెడ్ కి చెందిన రూ. 501.13 కోట్లు, డెవలప్‌మెంట్స్ లిమిటెడ్‌కు చెందిన రూ. 332.69 కోట్ల విలువైన 401.65479 ఎకరాల్లో విస్తరించి ఉన్న స్థిరాస్తులను ఇఆ అటాచ్ చేసింది. ఈ ఆస్తులు హర్యానా, ఢిల్లీలోని 20 గ్రామాల్లో ఉన్నాయి. ఎమ్మార్ ఇండియా లిమిటెడ్, డెవలప్‌మెంట్స్ లిమిటెడ్ రెండూ కూడా గురుగ్రామ్‌లోని సెక్టార్-65, 66లోని రెసిడెన్షియల్ ఎ÷-లాట్డ్ కాలనీల కోసం ఆ÷అఖ మంజూరు చేసిన లైసెన్స్‌లకు సంబంధించి మనీ లాండరింగ్ కోసం దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు వేర్వేరు భూ యజమానులు, సాధారణ ప్రజలు హుడాతో మోసానికి సంబంధించినది. ఇందులో భూసేకరణ చట్టం 1894లోని సెక్షన్ 4 ప్రకారం, ఆ తర్వాత చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం భూసేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేయబడింది. దీంతో భూ యజమానులు తమ భూములను తక్కువ ధరలకు ఈ వలస కంపెనీలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2009లో హర్యానా ప్రభుత్వం గురుగ్రామ్‌లోని సెక్టార్లు 58 నుంచి 63, సెక్టార్లు 65 నుంచి 67 వరకు ఉన్న 1417.07 ఎకరాల భూమిపై 1894 భూసేకరణ చట్టంలోని సెక్షన్ 4 కింద నోటిఫికేషన్ జారీ చేసింది.

## రైతుల ఆందోళనలపై కంగనా వ్యాఖ్యలు

చండీఘడ్,దేశ రాజధాని న్యూఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ఆందోళనలపై బీజేపీ ఎంపీ, ప్రముఖ నటి కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలపై సర్వత్ర నిరసన వ్యక్తమవుతుంది. కంగనా రనౌత్‌పై పంజాబ్‌కు చెందిన శిరోమణి అకాలీ దళ్ మాజీ ఎంపీ సిమ్రాన్‌జిత్ సింగ్ మాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అఘాయిత్యం ఎలా జరుగుతుందో కంగనా రనౌత్‌ను మీరు అడగవచ్చునన్నారు. తద్వారా అఘాయిత్యం ఎలా జరుగుతుందో ప్రజలకు వివరించవచ్చునని ఆయన తెలిపారు. ఆమెకు చాలా అనుభవం ఉందంటూ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌పై సంగ్రూర్ మాజీ లోక్‌సభ సభ్యుడు సిమ్రాన్‌జిత్ సింగ్ మాన్ వ్యంగ్యంగా ఆయన పేర్కొన్నారు. రైతుల ఆందోళనపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలపై మీ స్పందన ఏమిటని విలేకర్లు అడిగిన ప్రశ్నకు మాజీ ఎంపీ సిమ్రాన్‌జిత్ సింగ్‌పై విధంగా స్పందించారు. అకాలీ దళ్ మాజీ ఎంపీ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. ఇటీవల కంగనా రనౌత్ ఓ జాతీయ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల నిరసనల విషయంలో మోదీ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోకుంటే బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితులు భారత్‌లో సైతం ఏర్పడేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక ఈ కుట్రలో చైనా, అమెరికా దేశాల ప్రమేయం సైతం ఉందన్నారు. కేంద్రం రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఆందోళన జరిగినప్పుడు మహిళలపై అత్యాచారాలు జరిగాయని.. అలాగే చెట్లకు శవాలు సైతం వేలాడాయని కంగనా రనౌత్ గుర్తు చేశారు. కంగనా రనౌత్ చేసిన ఈ వ్యాఖ్యలపై బీజేపీ అగ్రనాయకత్వం సైతం స్పందించింది. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలతో పార్టీకి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. కంగన రనౌత్ చేసిన ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గేతోపాటు రాహుల్ గాంధీ సైతం విమర్శలు గుప్పించిన విషయం విధితమే. 2020-21 మధ్య రైతుల కోసం కొత్త చట్టాలను తీసుకు రావాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని దేశవ్యాప్తంగా రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ క్రమంలో ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ఆందోళనలు చేపట్టారు. ఈ ఆందోళనల్లో హరియాణా, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మరోవైపు రైతులను కంగనా చేసిన వ్యాఖ్యలపై విమర్శలు సైతం వెల్లువెత్తాయి. హిమాచాల్ ప్రదేశ్ అసెంబ్లీ అయితే.. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ తీర్మానం సైతం చేసింది.

# కొనసాగుతున్న హైడ్రా దూకుడు... ఫిర్యాదుల ఆధారంగా వివరాల సేకరణ



హైదరాబాద్,హైడ్రా దూకుడు కొనసాగుతోంది. ఆక్రమణలు గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నారు. ఎక్కడిక్కడ అధికారుల నుంచి సమాచారం తెప్పించుకుంటున్నారు. ఫిర్యాదులపైనా విచారణ చేస్తున్నారు. పూర్తిస్థాయి సమాచారంతో రంగంలోకి దిగుతున్నారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి ముందుకు సాగుతున్నారు. రామ్‌నగర్‌లో కాల్వ ఆక్రమణలను కూల్చేశారు. జాన్వాడపై పూర్తిస్థాయి నివేదిక కోసం ఎదురు చూస్తున్నారు. హిమాయత్ సాగర్‌లో ఆక్రమణలపైనా నివేదిక తెప్పించుకున్నారు. దుర్గం చెరువులో ఆక్రమణలపై కొరడా ఝళిపించారు. ఇందులో ఉన్నవారికి నోటీసులు ఇచ్చారు. ఇలా ఎక్కడి నుంచి ఫిర్యాదులు వచ్చినా స్వీకరిస్తున్నారు. ప్రజలు కూడా ఆక్రమణలపై తమవద్ద ఉన్న సమాచారం చేరవేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని 13 చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లలో నిర్మాణాలపై చర్యలు తీసుకుని, వాటిని తొలగించాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధికారులు ఈ నెల మూడో తేదీ నుంచి నిర్మాణదారులు, సంస్థల ప్రతినిధులకు తాఖీదులు జారీ చేస్తున్నారు. వారం రోజుల నుంచి నెల రోజుల్లోపు నిర్మాణాలను ఖాళీ చేయని పక్షంలో తామే కూల్చేస్తామని వాటిలో పేర్కొంటున్నారు. శేరిలింగంపల్లి మండలంలోని దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో అధికంగా నిర్మాణాలున్నట్టు అధికారులు గుర్తించారు. వీటిలో కొన్ని నిర్మాణాలు పలువురు సివిల్ సర్వీస్ అధికారుల పేరుపై ఉన్నాయి. ఐఆర్ఎస్ అధికారి చంద్రశేఖర్, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంతో పాటు మరికొందరు సినీ ప్రముఖుల నివాసాలు ఉన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి మాదాపూర్‌లోని అమర్ కో-ఆపరేటివ్ సొసైటీలో నివాసం ఉంది. వీటితో పాటు మాదాపూర్ పరిధిలోని అమర్ కో-ఆపరేటివ్ సొసైటీ, కావూరి హిల్స్, నెక్టార్ గాడర్గ్ కాలనీ, డాక్టర్స్ కాలనీలో పలు నిర్మాణాలకు తాఖీదులు జారీ చేశారు. చెరువుల ఎఫ్‌టీఎల్‌లు, బఫర్ జోన్లలో ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధికారులు సంయుక్త సర్వేలు చేశారు. మాదాపూర్‌లోని దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధుల్లో చాలామంది బహుళ అంతస్తులు నిర్మించారని గుర్తించారు. కొందరు జీప్లస్3, మరికొందరు డూప్లెక్స్ ఇళ్లు నిర్మించారు. ఇంకొందరు మాత్రం ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా వదిలేశారు. దుర్గం చెరువుతో పాటు గంగారం చెరువు, పెద్ద చెరువు, నల్లగండ్ల చెరువు, ఉప్పల్‌లో నల్లచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధుల్లోనూ ఈ తరహా నిర్మాణాలే ఉన్నట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఒక చెరువులో ఆక్రమణలు లేవని ప్రాథమికంగా గుర్తించారు. శేరిలింగంపల్లి మండల పరిధిలో దుర్గం చెరువు సహా ఐదు చెరువులు ఉన్నాయి. వీటి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధుల్లో 340 కట్టడాలు ఉన్నాయని సర్వేల్లో నిర్ధారించాం. వాటి వివరాలను హైకోర్టుకు రెండు నెలల క్రితం సమర్పించాం. ఆయా నిర్మాణాలను తొలగించేందుకు నిర్మాణదారులకు తాఖీదుల్లో గడువు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్లకు హైకోర్టు అదనపు అడ్వొకేట్ జనరల్ ఈ నెల 2న లేఖ రాశారు. ఈ లేఖలో పేర్కొన్న అంశాల ఆధారంగా ఆగస్టు 3న 240 మంది నిర్మాణ దారులు, సంస్థల ప్రతినిధులకు తాఖీదులు ఇచ్చాం. మరో 72 కట్టడాలను గుర్తించి.. వాళ్లకూ వివరణ ఇవ్వాలని కోరారు. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి నివాసం ఉందని నోటీసు జారీ అయింది. దుర్గం చెరువు సమీపంలోని అమర్ కో-ఆపరేటివ్ సొసైటీలో తాను కొనుగోలు చేసిన ఇల్లు బఫర్ జోన్‌లో ఉంటే కూల్చివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి అన్నారు. కూల్చివేసే ముందు కొంత సమయమిస్తే సామగ్రి తీసుకొని బయటకు వెళ్తాను. భారాస నాయకులు నా ఇంటి గురించి రాజకీయం చేస్తున్నారు.

# హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేలా గణేష్ ఉత్సవాలు



హైదరాబాద్: హైదరాబాద్ ఇమేజ్‌ను మరింత పెంచేలా గణేష్ ఉత్సవాల నిర్వహణ ఉండాలని, ఇందుకోసం ఉత్సవ కమిటీలు, మండప నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు ప్రధాన అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మండపాల ఏర్పాటు, తొమ్మిది రోజుల ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనానికి సంబంధించి మండప నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అధికారులు, మండప నిర్వాహకులు సమన్వయంతో ముందుకు సాగాలి ప్రభుత్వం తరపున పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, నీటి పారుదల శాఖ, విద్యుత్ శాఖతో పాటు ఇతర ముఖ్య శాఖల అధికారులు సైతం మండప నిర్వాహకులతో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఎక్కడ ఎటువంటి లోటుపాట్లకు తావివ్వద్దని హెచ్చరించారు. జోన్ల వారీగా ఉన్నతాధికారులకు బాధ్యతలు అప్పగించాలని, ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ శాంతియుతంగా ఉత్సవాలు, నిమజ్జనం కొనసాగేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఏ అధికారి ఏ జోన్‌లో బాధ్యతల్లో ఉన్నారు.. ఆయా ప్రాంతాల్లో ఉత్సవ కమిటీ ప్రముఖులు, మండపాల బాధ్యులు అన్నింటి వివరాలు సమగ్రంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలో గతేడాది 1.50 లక్షల విగ్రహాలు ఏర్పాటు చేశారనే లెక్కలున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ముందుగా మండప నిర్వాహకులు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లోనో అనుమతులు తీసుకోవాలని, అలా తీసుకోవడం వలన ఆయా ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ ఇతర ఇబ్బందులు తలెత్తకుండా చూసుకునే అవకాశం ఉంటుందన్నారు. మొత్తం విగ్రహాలను హుస్సేన్ సాగర్‌కే కాకుండా ఇతర చెరువుల్లోనూ నిమజ్జనం చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. సరూర్ నగర్‌తో పాటు పలు చెరువులు నీటితో ఉన్నాయని, ఏ ప్రాంతంలోని విగ్రహాలు ఆ ప్రాంతంలోని చెరువుల్లో నిమజ్జనం చేస్తే హుస్సేన్ సాగర్ వద్ద రద్దీ తగ్గడంతో పాటు ఆయా చెరువుల వద్ద నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం ముందుగానే చేసే వీలుంటుందన్నారు. ఈ విషయంలో ఉత్సవ సమితి సభ్యులు, మండప నిర్వాహకులు ముందగానే సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. నిమజ్జనానికి ముఖ్య అతిథులుగా ఎవరినైనా పిలిస్తే ముందుగానే ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలని, అలాగే వీవీఐపీలు ఎవరైనా వచ్చే అవకాశం ఉంటే ముందుగా తెలియజేస్తే పోలీసు శాఖ వారి రాకపోకలకు రూట్ క్లియరెన్స్ చేయడంతో పాటు తగిన భద్రత ఏర్పాటు చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నిమజ్జన ఊరేగింపు త్వరగా ప్రారంభిస్తే త్వరగా కార్యక్రమాన్ని ముగించుకోవచ్చని, ఫలితంగా భక్తులు ట్రాఫిక్, ఇతర ఇబ్బందులు బారిన పడకుండా చూసుకోవచ్చన్నారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నగరం పరిధిలోని నలుగురు లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకోవాలని ముఖ్యమంత్రి పోలీసులను ఆదేశించారు. సెప్టెంబరు 16న మిలాద్ ఉన్ నబి, 17న తెలంగాణలో వివిధ రాజకీయ పార్టీలు పలు కార్యక్రమాలు చేపడతాయని, అందువలన అన్ని కార్యక్రమాలకు సక్రమమైన ప్రణాళికతో ముందుకు సాగాలని, ఎక్కడా ఎటువంటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని పోలీసులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

### అనుమతులు తీసుకున్న మండపాలకు ఉచిత విద్యుత్

గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ముందుగా మండప నిర్వాహకులు ఉచిత విద్యుత్ సరఫరాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా విద్యుత్ వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, జవాబుదారీతనం కోసమే అనుమతి చేసుకోవాలని కోరుతున్నామని తెలిపారు. నిమజ్జనం రోజైన సెప్టెంబరు 17వ తేదీన అనంత చతుర్దశి వచ్చిందని, ఆ తేదీ ప్రాముఖ్యతను తెలుపుతూ దేవాదాయ శాఖ తరపున పర్వదిన ప్రాముఖ్యతను తెలిపే సాహిత్యాన్ని ప్రచురించాలని, ప్రచారం చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావును ముఖ్యమంత్రి ఆదేశించారు.

### సుప్రీంకోర్టు నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలి

మండపాల్లో డీజేలు వాడేందుకు అనుమతి ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం ముందుకు వెళతామని ముఖ్యమంత్రి తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి పర్యావరణ హిత (ఈకో ఫ్రెండ్లీ) విగ్రహాలు ప్రతి ష్ఠించాలని మంత్రి శ్రీధర్ బాబు ఉత్సవ సమితి నిర్వాహకులకు సూచించారు. గణేష్ ఉత్సవాలకు సంబంధించి ఇప్పటి వరకు చేపట్టిన సమావేశాలు, ఉత్సవ సమితి సభ్యులు చేసిన సూచనలు, పరిష్కరించిన సమస్యల వివరాలను మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. మొత్తంగా 25 వేల మందితో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీజీపీ జితేందర్, హైదరాబాద్ సిటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అన్ని శాఖలతోనూ సమన్వయం చేసుకుంటున్నామని వారు చెప్పారు. ఉత్సవాల్లో మట్టి విగ్రహాలు వాడేలా చూడాలని, మద్యం తాగి ఇబ్బంది పెట్టే వారి విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ ఏ.వి.ఎన్.రెడ్డి కోరారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్ అలీ, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వారికి తక్షణమే పరిహారం చెల్లించాలి

హైదరాబాద్, సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో పేదలు, దివ్యాంగుల ఇళ్లు కూల్చడమేంటని అధికారులను మాజీ మంత్రి, భారాస నేత శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. నోటీసులు లేకుండా ఎలా కూలుస్తారని నిలదీశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'డబ్బు ఉన్న వాళ్లకు ఎన్ని నోటీసులైనా ఇస్తారు కదా? దివ్యాంగులకు సంబంధించిన ఇళ్లను ఎందుకు కూల్చారు...వాళ్లపై మీ ప్రతాపమా? పేదలు, ధనికులకు న్యాయం ఒకవిధంగా ఉందా? ఇదేనా కాంగ్రెస్ మార్పు పాలన? బాధితులకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నారు. లేదంటే కచ్చితంగా న్యాయపోరాటం చేస్తాం. దీనిపై మానవ హక్కుల సంఘం సుమోటోగా కేసు నమోదు చేయాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి మానవత్వం లేదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నిన్న మహబూబ్‌నగర్ మున్సిపల్ అధికారులు ఆదర్శనగర్‌లోని పేద ఇండ్లను కూల్చివేసిన ఘటనపై ఆయన స్పందించారు. దివ్యాంగులు అని చూడకుండా వారి ఇండ్లను కూల్చడమంటే ఈ ప్రభుత్వానికి మానవత్వం అనేది లేదని తెలిపోయిందన్నారు. దివ్యాంగులు నివసిస్తున్న కాలనీలో అర్ధరాత్రి 400 మంది పోలీసులతో వెళ్లి వారిని బయటకి లాగేసి ఇళ్లను కూల్చడం బాధాకరం. నిన్న జరిగిన సంఘటనను మీడియా సరిగ్గా చూపిస్తే దివ్యాంగుల పట్ల భారతదేశంలో ఇట్లా జరుగుతుందా అని మన దేశానికి చెడ్డపేరు వచ్చే పరిస్థితి ఉండేదన్నారు. అలాగే సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ బాధితులకు శ్రీనివాస్ గౌడ్ అల్పాహారం అందజేశారు. బాధితుల పక్షాన పోరాడుతామని హామీనిచ్చారు. కాగా, హైదరా బాద్‌లో హైడ్రా తరహాలో పాలమూరులో కూడా అధికారులు కట్టడాలను నేలమట్టం చేస్తున్నారు. ఆదర్శనగర్‌లోని పేదల ఇండ్లను గురువారం తెల్లవారుజామున కూల్చివేశారు. భారీ బందోబస్తుతో రాత్రి 2 నుంచి 3 గంటల సమయంలో హఠాత్తుగా బుల్డోజర్లతో వచ్చిన అధికారులు.. పేదలు నిద్రిస్తుండగానే బయట నుంచి గోడలను నేలమట్టం చేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తుండగానే సుమారు 75 ఇండ్లను కూల్చివేసిన విషయం తెలిసిందే.

# గెలిస్తే మహిళలకు ఐవీఎఫ్ చికిత్స ఉచితం

వాషింగ్టన్, రెండోసారి అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. తాను గెలిస్తే మహిళలకు ఉచిత ఐవీఎఫ్ చికిత్సను అందించాలని అనుకుంటున్నట్లు తెలిపారు. దీన్ని ఎలా అమలు చేయనున్నారు? నిధులను ఎలా సమకూరుస్తారనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. 'ట్రంప్ పాలనలో ఈ చికిత్సకు సంబంధించిన అన్ని ఖర్చులను ప్రభుత్వమే చెల్లిస్తుంది. లేదా మీ బీమా కంపెనీ తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది' అని మిషిగన్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రకటించారు. ఈ చికిత్స అత్యంత ఖర్చుతో కూడుకొన్నది. అమెరికాలో ఒక దఫాకు పదివేల డాలర్ల వరకు ఖర్చవుతుందని అంచనా. ఈ చికిత్స ఫలవంతమయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నందున పలు దఫాల్లో తీసుకోవాల్సి రావొచ్చు. 1973లో రో వర్సెస్ వేడ్ కేసులో అనివార్య పరిస్థితుల్లో గర్భవిచ్ఛిత్తి చేయించుకునే హక్కు మహిళలకు ఉందని అమెరికా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. అదే అత్యున్నత న్యాయస్థానం ఆ తీర్పును కొట్టివేస్తూ గత ఏడాది మరో తీర్పు చెప్పింది. ఈ నేపథ్యంలో గర్భవిచ్ఛిత్తి విధానంపై ట్రంప్ కొంతకాలంగా భిన్నస్వరాలు వినిపించారు. చివరకు ఈ అంశాన్ని రాష్ట్రాలకు వదిలేయాలని ప్రతిపాదించారు. దీంతో ఈ విషయంపై ట్రంప్‌ను ఉద్దేశించి డెమోక్రాట్లు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ తరుణంలో తాజా ప్రకటన రావడం గమనార్హం. సంతానలేమితో బాధపడుతున్న ఎంతోమందిని కృత్రిమ గర్భధారణ పద్ధతులు ఆదుకుంటున్నాయి. సంతాన భాగ్యాన్ని ప్రసాదిస్తున్నాయి. వీటిల్లో ఎక్కువగా వాడకంలో ఉన్నది ఐవీఎఫ్ పద్ధతే. ప్రయోగశాలలో అండాన్ని, శుక్రకణాలను ఫలదీకరణ చెందించి, అభివృద్ధి చెందిన పిండాన్ని మహిళల గర్భసంచిలో ప్రవేశపెట్టటం దీనిలోని కీలకాంశం. దీంట్లో వెంటనే గర్భం వస్తుందని, సంతానం కలుగుతుందని చాలామంది భావిస్తుంటారు. నిజానికి అందరికీ తొలిసారే సంతానం కలగకపోవచ్చు. రెండు మూడు సార్లు ప్రయత్నించాల్సి రావొచ్చు. కొందరికి సఫలం కాకపోవచ్చు కూడా. అందుకే ఈ చికిత్స చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఇకపోతే డెమోక్రటిక్ అధ్యక్ష అభ్యర్థి కమలా హ్యారిస్.. సీఎన్ఎన్ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూపై రిపబ్లికన్ నేత డోనాల్డ్ ట్రంప్ స్పందించారు. కమలా హ్యారిస్ ఇంటర్వ్యూ బోరింగ్‌గా ఉన్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. మీడియా వేసిన ప్రశ్నలకు ఆమె సరైన సమాధానాలు ఇవ్వలేదన్నారు. సోషల్ మీడియా ట్రుత్ ద్వారా ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. హ్యారిస్ విలువల మారలేదన్నారు. కమలా ఇచ్చిన వాగ్దానాలతో అమెరికా వేస్ట్‌ల్యాండ్‌గా మారుతుందని ఆయన ఆరోపించారు. కమలా హ్యారిస్‌తో చర్చించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు ట్రంప్ తెలిపారు. మిచిగన్‌లో జరిగిన సభలోనూ ట్రంప్ మాట్లాడారు. హ్యారిస్‌ది ఫ్లాప్ షో అని విమర్శించారు.

# వణికిస్తున్న ఎంపాక్స్..!

న్యూఢిల్లీ, పలు ప్రపంచవ్యాప్తంగా దేశాల్లో ఎంపాక్స్ కేసులు పెరుగుతున్నాయి. దీంతో ఆరోగ్య నిపుణులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నారు. మధ్య, పశ్చిమ ఆఫ్రికా దేశాల్లో జూనోటిక్ వైరల్ కేసులు భారీగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం కాంగో దేశంలో ఎంపాక్స్ కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వైరస్ సోకిన వారి సంఖ్య ఇటీవల భారీగా పెరిగింది. కాంగో ఆరోగ్యశాఖ మంత్రి రోజర్ కంబా ప్రకటన ప్రకారం.. ఇప్పటి వరకు 18వేల మందికిపైగా కేసులు నమోదు అయ్యాయి. ఇందులో కనీసం 610 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. విస్తరిస్తున్న వైరస్ మధ్య ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎంపాక్స్ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వైరస్‌లో ప్రధానంగా వైరస్, వైరస్ సోకిన వ్యక్తులకు దగ్గరగా ఉండటం, రోగులు వాడిన దుస్తులు వాడడం వల్ల వైరస్ సోకుతుందని నిపుణులు సూచించారు. కాంగోతో సహా అనేక దేశాల్లో కొత్త ఎంపాక్స్ స్ట్రెయిన్‌పై అధ్యయనం చేస్తున్న శాస్త్రవేత్తలు వైరస్ ఊహించిన దానికంటే చాలా వేగంగా వ్యాప్తి చెందుతుంది, రూపంలోనూ మార్పులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే, వైరస్‌ను సరిగ్గా అమలు చేయాల్సిన అవసరం లేదని, వైరస్ తీవ్రత, వ్యాప్తి చెందుతున్న మార్గాలు వంటి అనేక విషయాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. ఎంపాక్స్ విజృంభణ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ రెండోసారి హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించింది. ఆ తర్వాత ఎంపాక్స్ కొత్త స్ట్రెయిన్, క్లాడ్ ఐబీ పేర్కొన్నారు. ఇదే కేసుల పెరుగుదలకు దారితీసిందని అనుమానిస్తున్నారు. నైజీరియాలోని డెల్టా యూనివర్సిటీ హాస్పిటల్‌లో ఇన్ఫెక్షియస్ డిసీజ్ స్పెషలిస్ట్, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎంపాక్స్ ఎమర్జెన్సీ కమిటీ చైర్మన్ డాక్టర్ డిమి ఒగోయినా మాట్లాడుతూ ఆఫ్రికాలో ఎంపాక్స్‌పై ఆందోళన వ్యక్తం చేశారు.

# షర్మిలమ్మ లిస్ట్ ని కాంగ్రెస్ పక్కన పెట్టేసిందా...ఏం జరుగుతోంది ?

అమరావతి, ఏపీ కాంగ్రెస్ చీఫ్ గా ఎకాఎకిన వైఎస్ షర్మిల అయిపోయారు. దానికి కారణం ఆమె తండ్రి వైఎస్సార్ కావడం. అలాగే అన్న వైఎస్ జగన్ ఏపీ సీఎం గా ఉండడం. ఈ రెండు నీడలే ఆమెను కాంగ్రెస్ గొడుగు కిందకు చేర్చాయి. ఉన్నట్లుండి పెద్ద పదవికే అప్పగించాయి. ఏపీలో కాంగ్రెస్ కి ఏముందని అనుకోవచ్చు. ఏమి ఉన్నా లేకపోయినా పీసీసీ చీఫ్ అంత సులువుగా దక్కే పదవి కాదు. ఏపీ కాంగ్రెస్ నే నమ్ముకుని ఇంకా చాలా మంది సీనియర్ లీడర్లు ఉన్నారు. వారంతా మరే పార్టీలోకి వెళ్లేది ఉండదు. ఇక షర్మిలను ఏపీకి తేవడంలో కాంగ్రెస్ ఒక టాస్క్ ని సక్సెస్ ఫుల్ గా నెరవేర్చుకుంది. అదే వైఎస్ జగన్ ని గద్దె దించడం. అధికారంలో లేని వైసీపీ నుంచి నేతలు వలస బాట పడతారని కాంగ్రెస్ కి ఏదో నాడు వారంతా జమ అవుతారని కేంద్ర నాయకత్వం భావిస్తోంది. ఇక ఏపీలో వైసీపీ ఓటమి పాలు అయింది కాబట్టి షర్మిలకు అప్పగించిన రెండవ టాస్క్ వైసీపీ నుంచి నేతలను కాంగ్రెస్ వైపు మళ్ళించడం. ఆ పనిలో షర్మిల ఎంత మేరకు సక్సెస్ అయ్యారంటే జవాబు ఎవరికి వారుగా తెలుసుకోవాల్సిందే. కాంగ్రెస్ ఏపీ పట్ల ఎంత ఫోకస్ పెట్టిందో అన్నది వైఎస్సార్ జయంతిని ఏపీలో గ్రాండ్ గా జరపడం, దానికి తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి సహా కీలక మంత్రులు నేతలను పిలవడం అన్నీ చూశారు. అంత ఖర్చు పెట్టి ఆర్భాటంగా కార్యక్రమాలు చేసినా ఒక్కరంటే ఒక్క నాయకుడు కాంగ్రెస్ వైపు చూడలేదు. వలసలు అన్నీ టీడీపీ వైపుగానే సాగుతున్నాయి. వైసీపీ నుంచి ఇంకా ఏమైనా సాగితే జనసేన లేక బీజేపీ దిశగా వెళ్తున్నాయి. మరి లోపం ఎక్కడ ఉంది అంటే షర్మిల సింగిల్ పాయింట్ అజెండా నుంచి బయటకు రాకపోవడం వల్లనే అని అంటున్నారు. ఆమె ఎన్నికల నుంది అధికారంలో ఉన్న వైసీపీని జగన్ ని విమర్శిస్తే అది బాగా పండింది. హిట్ అయింది. కానీ ఇపుడు ఏపీలో వైసీపీ విపక్షంలో ఉంది. దాంతో రూట్ మార్చాలి. వ్యూహాలు మార్చాలి. కానీ షర్మిల పీసీసీ చీఫ్ గా ఉంటూ సొంత అజెండాను వ్యక్తిగత వైరాన్ని ముందుకు తెస్తున్నారని కాంగ్రెస్ లో నేతలు అంటున్నారు. దాని వల్లనే వైసీపీ నుంచి వలసలు రావడం లేదు అని అంటున్నారు. వైసీపీ నేతలకు కాంగ్రెస్ లోకి రావాలని ఉన్నా షర్మిల వైఖరి కూడా నచ్చక సైలెంట్ అవుతున్నారు అన్న మాట కూడా ప్రచారంలో ఉందిట. ఇక ఇటీవల ఢిల్లీలో జరిగిన పీసీసీ మీటింగ్ కి అటెండ్ అయిన షర్మిల ఏపీ పీసీసీ పదవులను తన వారితో భర్తీ చేయడానికి యాభై మందితో ఒక లిస్ట్ ని ఇచ్చారు అని




అంటున్నారు. ఆ లిస్ట్ లో ఉన్న వారికి పదవులు ఇస్తే తాను సాఫీగా ఏపీలో కాంగ్రెస్ రథాన్ని నడుపుతాను అని ఆమె అంటున్నారని ప్రచారంలో ఉంది. అయితే ఆ లిస్ట్ కి కేంద్ర నాయకత్వం ఆమోదముద్ర వేయలేదని అంటున్నారు. అందులో ఉన్న వారు షర్మిల అనుచరులు తప్ప కాంగ్రెస్ కోసం పనిచేసే వారికి న్యాయం జరగలేదని పార్టీలోని సీనియర్లు చెప్పడం వల్లే ఆ లిస్ట్ ఆగింది అని అంటున్నారు. సుంకర పద్మశ్రీ వంటి వారిని షర్మిల తప్పించడం, అలాగే పార్టీలో మొదటి నుంచి ఉన్న నేతలను సైడ్ చేయడం వంటి వాటి మీద కూడా కేంద్ర నాయకత్వానికి ఫిర్యాదులు వెళ్లాయని అంటున్నారు. దాంతో నాలుగు రాష్ట్రాల ఎన్నికల తరువాతనే ఏపీ పీసీసీ పదవుల భర్తీకి కాంగ్రెస్ ఆసక్తి చూపుతుందని అంటున్నారు. ప్రస్తుతానికి అయితే షర్మిల పీసీసీ చీఫ్ గా ఉన్నారు. మిగిలిన కార్యవర్గాన్ని నియమించాల్సి ఉంది. మరి ఆమె మాటకు ఓకే అని కాంగ్రెస్ అధినాయకత్వం ఆమె చెప్పిన పేర్లకు ఆమోద ముద్ర వేస్తుందా లేక అందరి అభిప్రాయాలను తీసుకుని ఒక సమిష్టి నాయకత్వానికి గుర్తుగా లిస్ట్ ప్రకటిస్తుందా అన్నది చూడాలని అంటున్నారు. ఏది ఏమైనా కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం మాత్రం సమిష్టిగానే ఏపీ కాంగ్రెస్ ముందుకు సాగాలని కోరుకుంటోందని అంటున్నారు. అలాగే సింగిల్ పాయింట్ అజెండాలు కాకుండా కాంగ్రెస్ వృద్ధి కోసం అంతా పనిచేయాలని సూచిస్తోందని అంటున్నారు. మరో రెండు నెలల తరువాత కాంగ్రెస్ ఏపీ మీద ఫుల్ ఫోకస్ పెడుతుందని అంటున్నారు. మరి కాంగ్రెస్ కనుక సమిష్టి నాయకత్వం అంటే ఏపీ కాంగ్రెస్ లో ఏమి జరుగుతుంది అన్నది చూడాల్సి ఉంది.

# వైసిపికి నేతల వరుస షాక్‌లు

అమరావతి, ఏపీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైసీపీకి ఆ పార్టీ నేతలు వరుసగా గుడ్ బై చెబుతున్నారు. తాజాగా ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, బల్లి కళ్యాణ్ చక్రవర్తి గుడ్ బై చెప్పారు. వీరిద్దరు ఏ పార్టీలో చేరుతారో అన్నదానిపై ప్రకటన చేయలేదు. వైసీపీతో పాటు ఎమ్మెల్సీ పదవులకు కూడా రాజీనామా చేశారు. బల్లి కల్యాణ చక్రవర్తి నెల్లూరు కు చెందిన వారు. ఆయన మాజీ ఎంపీ బల్లి దర్గాప్రసాదరావు కుమారుడు. తిరుపతి ఎంపీగా ఉంటూ బల్లి దుర్గా ప్రసాదరావు చనిపోయారు. ఉపఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ దుర్గా ప్రసాదరావు కుటుంబానికి టిక్కెట్ కేటాయించలేదు. సాధారణంగా పదవిలో ఉంటూ ఎవరైనా చనిపోతే ఆ కుటుంబానికి టిక్కెట్ కేటాయిస్తారు. కానీ పాదయాత్రలో తనకు ఫిజియోగా పని చేసిన వైద్యుడు గురుమూర్తికి టిక్కెట్ ఇచ్చారు. బల్లి దుర్గాప్రసాదరావు కుమారుడు కల్యాణ్ చక్రవర్తికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. ఆయన పదవి కాలం ఇంకో మూడేళ్లు ఉంది. మరో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అయ్యారు. ఆమె భర్త నారాయణరావు వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఉన్నారు. ఆమె బీజేపీ అనుబంధ సంస్థల్లో చురుగ్గా ఉండేవారు. మత్స్యకారుల్లో వాడబలిజ సామాజికవర్గానికి చెందిన ఆమె జాతీయ మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. ఆమెకు బీజేపీకి చెందిన కొంత మంది కీలక నేతలతో సంబంధాలు ఉన్నాయని భావిస్తున్నారు. అయితే ఆమెకు వైసీపీలో ఎమ్మెల్సీ రావడమే ఆ పార్టీలో ఆశ్చర్యానికి కారణం అయింది. ఇప్పటికీ ఆమెకు మరో ఐదేళ్ల వరకూ పదవి కాలం ఉంది.

# అనుమతులు లేకుండా జాన్వాడ ఫామ్‌హౌజ్ నిర్మాణం

హైదరాబాద్, జన్వాడ ఫాంహౌస్‌కు రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల నుంచి ఎలాంటి అనుమతుల్లేవని అధికారులు ప్రాథమిక సమాచారం సేకరించినట్లు తెలిసింది. హైదరాబాద్ సమీపంలోని శంకర్‌పల్లి మండలం జన్వాడ రెవెన్యూ పరిధిలో ఉన్న ఈ ఫాంహౌస్ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అధీనంలో ఉండడం, బుల్కాపూర్ నాలా బఫర్‌జోన్ పరిధిలో ఉందన్న ప్రచారంతో చేవెళ్ల రెవెన్యూ డివిజన్ అధికారులు అంతర్గతంగా పలు అంశాలను సేకరించారని సమాచారం. ఈ ఫాంహౌస్‌ను మీర్జాగూడ గ్రామపంచాయతీ పరిధిలో ఎనిమిదేళ్ల క్రితం నిర్మించారు. అప్పట్లో గ్రామపంచాయతీ కార్యదర్శి అక్రమ కట్టడంగా గుర్తించారని తెలుస్తోంది. ఫాంహౌస్ యజమాని ఎన్.ఎస్.ఎల్.ఆర్.ప్రసాదరాజు చిరునామాకు నోటీసులు సైతం పంపించారని సమాచారం. ఆయన స్పందించకపోవడంతో పంచాయతీ ఆదాయం నిమిత్తం కొద్దిరోజుల తర్వాత ఫాంహౌస్‌కు ఇంటి నంబర్ 4-5 కేటాయించి అసెస్‌మెంట్ చేశారు. ఫాంహౌస్ విస్తీర్ణం 362 గజాలని, 3,200 చదరపు అడుగుల్లో ఉందని గ్రామపంచాయతీ అధికారులు లెక్కలు వేసి.. ఏటా రూ.11 వేలు పన్ను చెల్లించాలని అసెస్‌మెంట్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జీవో నంబరు 111 పరిధిలో ఫాంహౌస్ ఉందని తెలిసినా.. దాన్ని వేరే యంత్రాంగం పర్యవేక్షిస్తుందన్న భావనతో అప్పట్లో వారు పన్ను మాత్రమే విధించారు. ఆ మేరకు నిర్వాహకులు ఏటా ఇంటి పన్ను చెల్లిస్తున్నారు. జన్వాడ ఫాంహౌస్ పరిసర ప్రాంతాల్లో ప్రవహిస్తున్న బుల్కాపూర్ నాలా పరీవాహక ప్రాంతంలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు గురువారం సర్వే పూర్తి చేశారు. ఉపగ్రహ చిత్రాలు, గ్రామపటాలను సరిపోల్చారు. నాలా బఫర్‌జోన్‌లో ఫాంహౌస్ ఉందా? లేదా? అని నిర్ధారించుకున్నాక రంగారెడ్డి కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నారు. ఇప్పటికే అధికారులు వరుసగా పలు దఫాలుగా ఇక్కడ పరిశీలన చేశారు. అయితే ఈ ఫామ్ హౌజ్ తనది కాదని, తన మిత్రుడిదని మాజీమంత్రి కెటిఆర్ ప్రకటించడం కొసమెరుపు.

# అంతర్యుద్ధం...

ఇస్లామాబాద్: పాకిస్థాన్ భద్రతా దళాలు పెంచి పోషించిన తాలిబాన్ 2021లో అఫ్ఘానిస్థాన్‌లో అధికారం చేజిక్కించుకున్న తర్వాత నుంచి పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడులతో ఉక్కిరిబిక్కిర వుతోంది. ముఖ్యంగా అఫ్ఘానిస్థాన్-పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉన్న బలూచిస్థాన్, ఖైబర్ ఫక్తూనా?ఖ్వ ప్రాంతాల్లో దాదాపు అంతర్యుద్ధం పరిస్థితి ఏర్పడింది. ఒక్క 2023లోనే పాకిస్థాన్ లో సుమారు 650 ఉగ్ర దాడులు జరిగాయంటే అక్కడి పరిస్థితి ఏ స్థాయిలో ఉన్నదీ అర్థం చేసుకోవచ్చు. ఇందులో 23 శాతం దాడులు బలూచిస్థాన్‌లోనే జరిగాయి. పాకిస్థాన్‌లో అత్యధిక జనాభా కలిగిన బలూచిస్థాన్ ప్రస్తుతం చొరబాట్లకు, ఉగ్రవాదులకు, దాడులకు, ఘర్షణలకు నిలయంగా మారింది. అనేక ఉగ్రదాడులు, ఊచ కోతలు జరిగిన మాట నిజమే కానీ, రెండు రోజుల క్రితం జరిగిన దాడి మాత్రం వీటన్నిటినీ తలదన్నేలా కనిపించింది. బలూచిస్థాన్ వేర్పాటువాద నాయకుడు నవాబ్ అక్బర్ బుగ్తి 18వవర్ధంతి సందర్భంగా వేర్పాటువాదులు జరిపిన దాడుల్లో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ వేర్పాటువాద నాయకుడిని 2006లో పాకిస్థాన్ సైన్యం కాల్చి చంపింది. అందుకు ప్రతీకారంగా గత సోమవారం నాడు పెద్ద ఎత్తున వేర్పాటువాదులు దాడులకు పాల్పడ్డారు. అనేక హత్యలకు తమదే బాధ్యత అని బలూచిస్థాన్ వేర్పాటువాదులు ప్రకటించారు. పాకిస్థాన్‌లోని పంజాబ్ నుంచి బలూచిస్థాన్‌లోకి వలస వచ్చిన కార్మికులందరినీ వారు ఊచకోత కోశారు. ఇళ్లు, ఆఫీసుల్లోకి దూసుకుపోయి, అక్కడి ఫర్నిచర్‌ను, ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. ప్రాథమిక సదుపాయాలన్నిటినీ నాశనం చేశారు. అఫ్ఘానిస్థాన్ నుంచి బలూచిస్థాన్‌లో అక్రమంగా ప్రవేశిస్తున్న చొరబాటుదార్లు, బలూచిస్థాన్ వేర్పాటువాదుల అఘాయిత్యాలకు అడ్డూ ఆపూ ఉండడం లేదు. బుగ్తి వర్ధంతి సందర్భంగా దేశంలో ప్రతి ఏటా ఇటువంటి హింసా విధ్వంసకాండలు జరుగుతూనే ఉన్నప్పటికీ, ఈసారి మాత్రం పాకిస్థాన్ సైన్యానికి గానీ, గూఢచారి వర్గాలకు గానీ, వేర్పాటువాదుల దాడులు అంతుబట్టలేదు. బలూచిస్థాన్ వేర్పాటువాదుల ఆందోళనల విషయంలో పాకిస్థాన్ ప్రభుత్వం మొదటి నుంచి క్రూరంగానే వ్యవహరిస్తోంది. తన సైన్యాన్ని ఉపయో గించి వీరిని అణచివేసే ప్రయత్నం చేస్తోంది. సహజ వనరులకు సంబంధించినంత వరకూ బలూచిస్థాన్ ఒక సుసంపన్నమైన ప్రాంతం. అయితే, మొత్తం పాకిస్థాన్‌లో ఇదే అత్యంత పేదరిక ప్రాంతం. ఈ ప్రాంతాన్ని పాకిస్థాన్ ప్రభుత్వాలు ఏనాడూ పట్టించుకున్న దాఖలాలు లేవు. పంజాబ్ ఇందుకు పూర్తిగా భిన్నమైన ప్రాంతం. పెద్దగా సహజ వనరులు లేనప్పటికీ, ఇది సుసంపన్నమైన ప్రాంతంగా అభివృద్ధి చెందింది. రాజకీయంగా కూడా పంజాబ్ రాష్ట్రానికి ఉన్నంత ప్రాబల్యం దేశంలోని మరే ప్రాంతానికీ లేదు. ఫలితంగా బలూచిస్థాన్‌లో చాలా వర్గాల్లో పంజాబ్ పట్ల వ్యతిరేకత నరనరానా జీర్ణించుకు పోయింది. ఇక్కడి పేదరికాన్ని, పక్షపాతాన్ని వేర్పాటువాదులు అవకాశంగా తీసుకుని ప్రత్యేక బలూచిస్థాన్ కోసం ప్రజలను రెచ్చగొట్టి, తమ వైపు తిప్పుకోవడం జరిగింది. స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఎటువంటి ఉపయోగమూ కలిగించకుండా, స్థానికులకు ఏ మాత్రం సహాయం చేయ కుండా ఇక్కడి సహజ వనరులను ప్రభుత్వం దోచుకోవడాన్ని వీరు నిరసిస్తున్నారు. ఈ ప్రాంతం మీదుగా నిర్మాణమవుతున్న పాకిస్థాన్-చైనా ఆర్థిక నడవాను కూడా ఇక్కడి వేర్పాటువాదులు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నడవా వల్ల చైనా అత్యధికంగా లబ్ధి పొందుతోందని వీరు విమర్శిస్తున్నారు. పాకిస్థాన్ ప్రభుత్వం బలూచిస్థాన్ కు చెందిన మానవ హక్కుల సంఘాలను కూడా పట్టించుకోవడం లేదు. ఈ సంఘాల ప్రతినిధులు తరచూ ఇస్లామాబాద్, కరాచీ వంటి నగ రాల్లో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వానికి బలూచిస్థాన్‌లో మానవ హక్కులను దుర్వి నియోగం చేస్తున్న ఉదంతాలను వెల్లడించడం జరుగుతోంది. అయితే, పాకిస్థాన్ ప్రభుత్వం, పాకిస్థాన్ సైన్యం ఈ మానవ హక్కుల ఉద్యమ నాయకులను పాకిస్థాన్ శత్రువులుగా పరి గణించి, వారిని మట్టు బెట్టడమో, అరెస్టు చేయడమో జరుగుతోంది. అంతేకాక, బలూచిస్థాన్ ఆందోళనకారుల మీద, వారి కుటుంబాల మీద సైనికులు మరింతగా దమననీతిని ప్రద ర్శించడం కూడా జరుగుతోంది. ఇటీవలి దాడులను దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే, పాక్ సైనికుల దమననీతి కారణంగా వేర్పాటువాద ఉద్యమం మరింత ఉధృతం అవుతోందే తప్ప తగ్గడం లేదని అర్థమవుతోంది. పాకిస్థాన్ ప్రభుత్వం బలూచిస్థాన్ సమస్యను పరిష్కరించా లన్న పక్షంలో, ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం, మానవ హక్కులను కాపాడడం, స్థానికులతో చర్చించడం వంటివి చేయాల్సి ఉంటుంది.

### రుణమాఫీ అమలులో విఫలం: అర్వింద్

నిజామాబాద్, రైతు రుణమాఫీ అమలులో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో రుణమాఫీ పేరుతో రైతులను రేవంత్‌రెడ్డి మోసం చేశారని విమర్శించారు. మొదటి హామీ అమలులోనే కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా తక్షణమే రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నటికీ విలీనం కాదని

# హైదరాబాద్‌లో మరో జూ పార్క్.. వెయ్యి ఎకరాల్లో ఏర్పాటుకు సీఎం రేవంత్ ఆదేశాలు



హైదరాబాద్ : రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కొత్త రూపకల్పన కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను నియమించారు. టూరిజంలో ముందంజలో ఉన్న ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను తెలుసుకోవాలని, వాటిలో మెరుగైనవి, మన రాష్ట్రానికి అనువుగా ఉన్న వాటిని అనుసరించాలని సూచించారు. స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) సమీక్షలో భాగంగా శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టూరిజం అభివృద్ధి ప్రాజెక్టులపై అధికారులతో సమావేశమయ్యారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియల్‌తో పాటు వివిధ విభాగాల్లో ఈ సమావేశం జరిగింది. హైదరాబాద్ బయట దాదాపు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో కొత్త జూ పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వివిధ ప్రాంతాల నుంచి జంతువులు, పక్షులను తీసుకొచ్చి కొత్త జూ పార్క్‌లో ఉంచాలని, అర్బన్ ఫారెస్ట్‌ని అభివృద్ధి చేయాలని చెప్పారు. జామ్ నగర్‌లో అనంత్ అంబానీ 3 వేల ఎకరాల్లో వనతార వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని నెలకొల్పిన సీఎం ప్రస్తావించారు. అలా ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలు, సంస్థలను కూడా ఆహ్వానించాలని ముఖ్యమంత్రి చెప్పారు. అనంతగిరి ప్రాంతంలో అద్భుతమైన ప్రకృతి సంపద ఉందని, అక్కడ ఉన్న 200 ఎకరాల ప్రభుత్వ భూములను హెల్త్ టూరిజం కోసం వినియోగించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. బెంగుళూరులోని జిందాల్ నేచర్ క్యూర్ ఇన్ కొత్త తరహాలో నేచర్ వెల్ నెస్ సెంటర్ అనంతగిరిలో ఏర్పాటు చేసింది. వెల్ నెస్ సెంటర్ ఏర్పాటుకు జిందాల్ ప్రతినిధులు ఆసక్తిగా ఉంటే సంప్రదింపులు జరపాలని, వైద్య రంగంలో పేరొందిన ప్రముఖ సంస్థలను ఆహ్వానించాలని రేవంత్ రెడ్డి సూచించారు.

# ఐదేళ్ల తర్వాత ప్రధాని ఎవరో హింట్ ఇచ్చిన మోదీ..

న్యూఢిల్లీ, శుక్రవారం ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2024ను ఉద్దేశించి మాట్లాడిన మోదీ.. దేశ పౌరులకు నాణ్యమైన జీవన శైలిని అందించడంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా.. యావత్ ప్రపంచ జీవన సౌలభ్యాన్ని భారతదేశ ఆర్థిక ఎకోసిస్టమ్ మెరుగుపరుస్తుందని చెప్పారు. 'ఇది ఐదో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్. పదో ఫిన్‌టెక్ ఫెస్ట్‌ను ఉద్దేశించి మాట్లాడేందుకు కూడా నేను వస్తాను' అని చెప్పారు. ఫిన్‌టెక్ ఫెస్ట్ ఏటా జరుగుతుంటుంది. అంటే.. ఐదేళ్ల తర్వాత కూడా తాను ప్రధానిగా ఉంటాననే సంకేతాలను ఆయన ఇచ్చారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానిగా మోదీ ప్రస్తుత పదవీకాలం 2029 మే నెల వరకూ ఉంటుంది. ఈ లెక్కన ఫిన్‌టెక్ పదో ఫెస్ట్ 2029 జూలై లేదా ఆగస్ట్‌లో నిర్వహిస్తారు. ఇదిలా ఉంటే.. సమాజ పరివర్తనలో ఫిన్‌టెక్ కీలకమైన పాత్ర పోషించిందన్న ప్రధాని.. యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్  భారతదేశ ఫిన్‌టెక్ విజయానికి గొప్ప ఉదాహరణ అని చెప్పారు. ఇంతటి వేగవంతమైన మార్పునకు ప్రపంచంలో మరో ఉదాహరణ లేదన్నారు. ఫిన్‌టెక్ విప్లవం పాదర్శకతను తీసుకొచ్చిందని, వ్యవస్థీకృత లోపాలను నిరోధించేందుకు సహకరించిందని మోదీ తెలిపారు. అదే సమయంలో సమాంతర ఆర్థిక వ్యవస్థకు చెక్ పెట్టిందన్నారు. 'ఈ పరివర్తన సాంకేతిక పరిజ్ఞానానికి మాత్రమే పరిమితం కాలేదు. సామాజికంగా కూడా ప్రభావాన్ని చూపింది. గ్రామాలు, నగరాలకు మధ్య అంతరాలను పూడ్చడంలో సహకరించింది. వినూత్నమైన ఆవిష్కరణలు, ఇతివృత్తాలతో కొత్త మార్కెట్‌లకు మార్గం సుగమం చేసింది' అని మోదీ అన్నారు. ఫైనాన్షియల్ సర్వీసులను ప్రజాస్వామ్యీకరించడంలో ఫిన్‌టెక్ గణనీయమైన పాత్రను పోషించిందని ప్రధాని మోదీ చెప్పారు. లబ్ధిదారులకు నగదు బదిలీ తో వ్యవస్థలో లీకేజీలను




అరికట్టగలిగిందని అన్నారు. ప్రజలు కూడా సంప్రదాయిక వ్యవస్థలో భాగస్వాములయ్యేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. 'జన్‌ధన్ యోజనకు పదేళ్లు పూర్తయ్యాయి. దానిని ప్రారంభించినప్పుడు పార్లమెంటులో అనేక మంది మమ్మల్ని ప్రశ్నించారు. ఈ రోజు మహిళా సాధికారతలో అదొక అద్భుతమైన మాధ్యమంగా నిలిచింది. 29 కోట్లకు పైగా మహిళలు తమ బ్యాంకు ఖాతాలను తెరిచారు' అని మోదీ చెప్పారు. ఈ ఖాతాలు మహిళలకు పొదుపు, పెట్టుబడులకు వేదికలుగా మారాయని అన్నారు. సైబర్ మోసాలను అడ్డుకునేందుకు, డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించేందుకు మరిన్ని చర్యలు చేపట్టాల్సి ఉన్నదని మోదీ అన్నారు. స్టార్టప్స్, ఫిన్‌టెక్‌ల వృద్ధిలో సైబర్ మోసాలు ఇబ్బందికరంగా పరిణమించకుండా చూడాల్సిన ఆవశ్యకత ఉన్నదని చెప్పారు. సైబర్ మోసాలను అత్యంత శక్తిమంతంగా నిరోధించాలని అన్నారు. దేశ యువత ప్రతిభపై తనకు పూర్తి నమ్మకం ఉన్నదన్న మోదీ.. మీకు ఇంకా అత్యుత్తమ సమయం ఇంకా రాలేదన్నారు.

# విచారణ కమిషన్ ముందు నటి జత్వానీ హాజరు

విజయవాడ, ముంబయి నటి కాదంబరి జెత్వానీ కేసు విషయంలో ప్రభుత్వం ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించిన క్రమంలో నటి జెత్వానీ శుక్రవారం విజయవాడకు వచ్చారు. మధ్యాహ్నం ఆమె పోలీస్ కమిషనర్‌ను కలిశారు. ఏసీపీ స్రవంతిరాయ్ నేతృత్వంలో ప్రత్యేక బృందం.. జత్వానీ నుంచి వివరాలు తీసుకున్నారు. అత్యాచారం కేసు నుంచి అన్ని పరిణామాలను ఆమె వివరించారు. వీటీపీఎస్ గెస్ట్‌హౌస్‌లో బంధించిన సమయంలో ఏయే పోలీసులు ఎలా ఇబ్బంది పెట్టారో చెప్పిన నటి జత్వానీ కన్నీళ్లు పెట్టుకున్నారు. 2023 డిసెంబర్ నుంచి కేసు పెట్టి.. 2024, మార్చి వరకూ జరిగిన ఘటనలు ఆమె వివరించారు. జత్వానీ వివరణను స్టేట్‌మెంట్, వీడియో రూపంలో కేసు విచారణాధికారులు తీసుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, ఆమెపై నమోదు చేసిన ఫోర్జరీ కేసునూ విచారణాధికారి పరిశీలించనున్నారు. ఏపీ పోలీసులు అక్రమ కేసులు పెట్టి తనను అనేక విధాలుగా వేధించారని నటి జెత్వానీ ఆరోపించారు. ఆ అధికారులకు సంబంధించిన అన్ని ఆధారాలు తన దగ్గర ఉన్నాయని.. వీటన్నింటినీ ఏపీ ప్రభుత్వానికి అందిస్తానని చెప్పారు. తన కుటుంబ సభ్యులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేశారని.. ఇప్పుడు సర్కారు తనకు సపోర్ట్ చేస్తుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో కొందరు తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని.. డబ్బుల కోసమే ఇలా మాట్లాడాతున్నానని తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జరిగిన అన్యాయంపై విచారణ జరిపి న్యాయం చేయాల్సిందిగా కోరుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వంపై తనకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. ముంబైకి చెందిన డాక్టర్, నటి కాదంబరి జెత్వానీ పలు మీడియా ఛానెళ్లతో మాట్లాడుతూ ఏపీ ఐపీఎస్ అధికారులు తనను అత్యంత ఘోరంగా వేధించారని.. తనతో పాటు తన తల్లిదండ్రుల్ని కూడా వేధించారని ఆరోపించారు. 40 రోజుల పాటు నిర్బంధించి ఖాళీ పత్రాలపై సంతకం పెట్టించుకుని వదిలి పెట్టారని అన్నారు. ఈ అంశం సంచలనంగా మారిన క్రమంలో ఏపీ ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. సీఎంవోకు



ఇంటలిజెన్స్ అధికారులు, విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు నివేదికలు సమర్పించారు. తీవ్ర ఆరోపణలు కావడంతో కేసు దర్యాప్తునకు ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. తన భద్రత, తన కుటుంబ భద్రతపై నటి ఆందోళన వ్యక్తం చేస్తోన్న క్రమంలో ఆమె వద్ద నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు తీసుకుని దర్యాప్తు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు.. ఆ కేసులో ఆ నటి కుటుంబాన్ని అరెస్టు చేయడానికి ముంబైకి వెళ్లిన బృందం మొత్తాన్ని ఓసారి పిలిపించి మాట్లాడారు. కృష్ణా జిల్లా వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ తమను రూ.5 లక్షలకు నటి కాదంబరి జెత్వానీ మోసం చేసిందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. కేసు నమోదు చేసి.. విమానాల్లో ముంబైకి వెళ్లి ఆ కుటుంబాన్ని పోలీసులు తీసుకు వచ్చినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా ఇలా వేరే రాష్ట్రాలకు వెళ్లి ఓ సినీ నటిని చీటింగ్ కేసులో అరెస్టు చేస్తే ప్రెస్ మీట్ పెట్టి చెప్పేవారు. అయితే కాదంబరి జెత్వానీ కుటుంబాన్ని తీసుకొచ్చి 40 రోజులు విజయవాడలో ఉంచినా సరే మీడియాకు సమాచారం ఇవ్వకుండా పూర్తిగా అంతర్గతంగానే ఉంచినట్లు తెలుస్తోంది. అదే సమయంలో బెయిల్ కూడా పోలీసులు ఇప్పించి ముంబైకి పంపినట్లుగా సమాచారం. అప్పటికే సెటిల్మెంట్ పై సంతకాలు పెట్టించుకున్నారని అంటున్నారు. దీనిపైనే నటి ఆరోపణలు చేయగా ప్రస్తుత ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

# సీఎం రేవంత్ సీరియస్.. మరి అసలు గుట్టు వీడేనా..!?




హైదరాబాద్, టిమ్స్(తెలంగాణ ఇన్‌గ్రేడ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆస్పత్రులు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల పేరుతో గత ప్రభుత్వం చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. ఈ ఆస్పత్రుల నిర్మాణ శంకుస్థాపనలు కూడా చేశారు. ఈ ఆస్పత్రుల కోసం చైనా నుంచి నిపుణులను రప్పించాలని ఆదేశాలు సైతం ఇచ్చారు. నిపుణులు వచ్చారా? లేదా? అన్నది పక్కన పెడితే.. ప్రస్తుతం వాటి నిర్మాణం కొనసాగుతోంది. ఇంత వరకు బాగానే ఉంది కానీ.. వాటి వెనకున్న లోగుట్టే.. ఏదో జరిగింది.. జరుగుతోందనే అనుమానాలకు తావిస్తోంది. ఈ సీక్రెట్ వ్యవహారాన్ని గమనించిన రేవంత్ సర్కారు అలర్ట్ అయ్యింది. విజిలెన్స్ అధికారులతో విచారణకు ఆదేశించింది. అవును.. గత సర్కార్ నిర్మించ తలపెట్టిన సూపర్ స్పెషాలిటీ, టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని ప్రభుత్వం భావిస్తోంది. నిర్మాణ వ్యయాలు పెంచడం, ఆసుపత్రి నిర్మాణ అంచనా తాకట్టు పెట్టడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అందుకే విజిలెన్స్ అధికారులతో దర్యాప్తు చేపట్టాలని, త్వరగా నివేదిక అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఉన్నట్లు సమాచారం.

నిర్మాణ వ్యయం పెంపు..

వాస్తవానికి బీఆర్ఎస్ ప్రభుత్వం.. హైదరాబాద్ నాలుగుమూలల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మించాలని భావించింది. ఈ మేరకు పనులను కూడా ప్రారంభించింది. ఎల్బీనగర్, అల్వాల్, సనత్‌నగర్‌లో తెలంగాణ ఇన్‌గ్రేడ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(టిమ్స్) ఆస్పత్రులు, వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించేందుకు నాటి ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులు కూడా ఇచ్చింది. అయితే, అల్వాల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి విషయంలో.. ప్రతిపాదిత అంచనా వ్యయం రూ.897 కోట్లు కాగా.. దానిని రూ.300 కోట్ల మేర పెంచి, రూ.1,197 కోట్లకు చేర్చారు. మరోవైపు.. వరంగల్‌లో ఆసుపత్రి పాత తాకట్టు పెట్టి మరీ రుణాలు తీసుకున్నారు. అయితే, తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సీఎం ప్రశ్నల వర్షం..

ఈ చివరికి సీఎం రేవంత్ దృష్టికి వెళ్లింది. సమగ్ర పరిశీలన జరిపిన సీఎం.. వ్యవహారంపై సీరియస్ అయ్యారు. వెంటనే వైద్యశాఖ అధికారులతో సమీక్షించారు. అంచనా వ్యయం పెంపుపై అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. అంతలా అంచనా వ్యయం పెరగడానికి కారణమేంటి? ఆసుపత్రి మొత్తం ఇటాలియన్ మార్బుల్స్ వేసినా.. ఇంత ఖర్చు కాదు కదా? అన్ని ప్రశ్నించారట. ఇక వరంగల్ ఆసుపత్రి స్థలం మార్టిగేజ్ వ్యవహారంపైనా సీఎం సీరియస్‌గా ఉన్నారట. మార్టిగేజ్ వెనుకున్న అసలు రహస్యం ఏంటో తేల్చాలని అధికారులను ఆదేశించారట.

అసలేం జరిగింది..?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం పూనుకుంది. ఇందులో భాగంగా మొదట హైదరాబాద్ నలుదిక్కులా టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణంతో పాటు.. వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించారు. హనుమకొండలోని పాత సెంట్రల్ జైలు దీనికోసం ఎంపిక చేశారు. 2 వేల పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం 2021 జూన్ 22న అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. మూడు బ్లాకులుగా, 34 విభాగాలతో 24 అంతస్తుల్లో 16.50 లక్షల చదరపు అడుగుల్లో నిర్మాణం తలపెట్టారు. ఆసుపత్రి నిర్మాణం త్వరగా పూర్తయ్యేందుకు చైనా నుంచి నిపుణులను రప్పించండి.. ఏడాదిన్నరలోపు ఆస్పత్రి నిర్మాణం పూర్తి కావాలన్నారు. అయితే ఏళ్లు గడిచినా ఆసుపత్రి నిర్మాణం పూర్తవలేదు.

స్థలం తనఖా పెట్టి..

అయితే, ఇంత పెద్ద ఆసుపత్రి నిర్మాణం కావడంతో ఏ బ్యాంకూ రుణం ఇచ్చేందుకు ముందుకురాలేదట. దీనితో నిధుల కోసం బీఆర్ఎస్ సర్కారు అప్పు బాట పట్టింది. ఇందులో భాగంగా టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్‌ను ఏర్పాటు చేసింది నాటి సర్కార్. దీని ద్వారా వరంగల్ ఆసుపత్రి జైలు తాకట్టు పెట్టి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నుంచి రుణం తీసుకుంది. మొత్తం రూ.1,173 కోట్లు రుణం పొందింది. దీనికిముందే టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్‌కు సర్వే నంబరు 31, 32లో 2,75,759 గజాల ప్రసార బదిలీ చేసింది.

ఆ డీటెయిల్స్ అన్నీ ఇవ్వండి..

కాగా, వరంగల్ జైలు తాకట్టు పెట్టి రుణం తీసుకోవడంపై గతంలోనే నాటి కాంగ్రెస్ నేత బక్క జడ్సన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ కమీషన్ల కోసమే రుణం తీసుకున్నారని, దాన్ని దుర్వినియోగం రిజర్వ్ బ్యాంకుకు ఫిర్యాదు చేశారు. విచారణ జరపాలని. ప్రస్తుతం ఈ వ్యవహారం సీఎం రేవంత్ దృష్టికి చేరడంతో.. ఈ వ్యవహారంపై ఆయన ఫోకస్ పెట్టారు. పూర్తి తక్షణమే పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారట. డీఎంఈ కార్యాలయంతో పాటు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నుంచి వివరాలను సేకరించాలని, జైలులో ఉన్న టీఎస్ఎస్ఎస్‌సీఎల్‌కు బదలాయిస్తూ జారీ చేసి నంబరు 81ను, ధృవీకరణ మార్టిగేజ్ చేసిన ఒప్పందం కాపీని పంపాలని అధికారులను సీఎం ఆదేశించారు. వీటితోపాటు హైదరాబాద్‌లోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రతో చేసుకున్న అవగాహన ఒప్పందం ప్రతిని కూడా పంపాల్సిందిగా కోరినట్లు సమాచారం. తాకట్టు స్థలం నుంచి ఎంతమేరకు రుణం తీసుకున్నారు? ఇప్పటివరకు ఎన్ని వాయిదాలు కట్టారు? ఇంకెన్ని కట్టాలి? వంటి వివరాలను వెంటనే తెలియజేయాలని అధికారులను సీఎం పరిశీలించారు.

# అసలు మోపిదేవి.. జగన్ మధ్య ఏం జరిగింది?



అమరావతి,వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, రాజ్యసభ సభ్యత్వానికి వైసీపీ నాయకుడు మోపిదేవి వెంకటరమణ రాజీనామా చేయడం రాజకీయంగా ఒకింత సంచలనం సృష్టించింది. వైసీపీ ఆవిర్భావం నుంచీ జగన్ తో కలిసి నడిచిన మోపిదేవి వెంకట రమణ.. పార్టీల కంటే వైఎస్ కుటుంబానికి విధేయుడిగా ఉ:టూ వచ్చారు. జగన్ అక్రమాస్తుల కేసులో అరెస్టు కూడా అయ్యారు. అటువంటి మోపిదేవి వెంకటరమణ వైసీపీకి రాజీనామా చేయడం రాష్ట్ర రాజకీయాలలో రానున్న భారీ మార్పులకు సంకేతంగా రాజకీయవర్గాలలో చర్చ జరుగుతోంది. వైసీపీ ఆవిర్భావం నుంచీ జగన్ కు అత్యంత సన్నిహితుడిగా మెలిగిన మోపిదేవి వెంకటరమణ, పార్టీలో కూడా కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఆయన వైసీపీకి భిన్నంగా వ్యవహరించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచీ కూడా ఆయన జగన్ కు విధేయంగా ఉంటూ వచ్చారు. అటువంటి మోపిదేవి పార్టీకి గుడ్ బై చెప్పడమే కాకుండా తెలుగుదేశం గూటికి చేరడానికి పోటీ ప్రకటించడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమౌతోంది. పార్టీకీ రాజీనామా చేసేంతగా మోపిదేవిలో జగన్ పట్ల అసంతృప్తిగా పేరు రావడానికి అనేక కారణాలు ఉన్నాయని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా 2024 అసెంబ్లీ ఎన్నికలలో రేపల్లె నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి తనకు కానీ, తన సోదరుడికి కానీ జగన్ టికెట్ నిరాకరించడం ప్రధాన కారణంగా చెబుతున్నారు. మోపిదేవి పలు మార్లు కోర కోసం రేపల్లె నుంచి మోపిదేవికి టికెట్ నిరాకరించే విషయంలో జగన్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. అలాగే ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల ఎంపిక విషయంలో అతడికి పూర్తిగా పక్కన పెట్టేయడంతో మోపిదేవికి అవమానకరంగా మారింది. అంతే కాకుండా పార్టీ వ్యవహారాలలో కూడా మోపిదేవికి ఇసుమంతైనా ప్రాధాన్యత ఇవ్వలేదు. ఇక పార్టీ పరాజయం తరువాత మోపిదేవి పూర్తిగా పార్టీకి దూరమయ్యారు. పార్టీ వ్యవహారాలు, కార్యక్రమాలలో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. దీని ఫలితాల తరువాత నుంచీ మోపిదేవి వైసీపీకి గుడ్ బై చెబుతారన్న టాక్టికల్ సర్కిల్స్ లో వినబడుతూనే ఉంది. ఇప్పుడు తెలుగుదేశంలో చేరేందుకు మోపిదేవి పార్టీకే కాకుండా రాజ్యసభ సభ్యత్వానికి కూడా రాజీనామా చేయడం ఆయన విధేయతలో స్పష్టమైన మార్పు వచ్చిందన్న సంగతి తెలిసిందే. ఇంతకీ మోపిదేవి చంద్రబాబుతో టచ్ లోకి ఎలా వెళ్లారంటే రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ హైదరాబాద్ లో చంద్రబాబుతో మోపిదేవి సమావేశమయ్యేందుకు సహకరించారు. ఆ సమావేశంలో మోపిదేవి వెంకటరమణతో పాటు మరో వైసీపీ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు కూడా ఉన్నారు. ఇప్పుడు ఈ ఇరువురూ కూడా వైసీపీకి, తమతమ రాజ్యసభ సభ్యత్వాలకూ రాజీనామా చేశారు. ఏ క్షణంలోనైనా తెలుగుదేశం కండువా కప్పుకుని ఆ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఏది ఏమైనా మోపిదేవి రాజీనామా అయితే వైసీపీకి గట్టి షాక్ అనే చెప్పాలి. మొత్తం మీద మోపిదేవి వంటి విధేయుడే దూరం అవ్వడం పార్టీలో జగన్ నాయకత్వంపై అవిశ్వాసం, అసంతృప్తి ఏ స్థాయిలో ఉందో అర్థమౌతుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. జగన్ తనకు బలం ఉందని రాజ్యసభలోనూ, ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలోనూ వైసీపీకి రానున్న రోజులలో గట్టి ఎదురుదెబ్బ తగలడం ఖాయమని చెబుతున్నారు.

## ఆందోళన కలిగిస్తున్న ఎంపాక్స్

న్యూఢిల్లీ, కరోనా పీడ వదిలిందనుకుంటే ఏదో ఒక మాయదారి రోగం దాపురిస్తోంది. తాజాగా ఇప్పుడు మంకీ పాక్స్ భయం పుట్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఎంపాక్స్ కేసులు పెరుగుతున్నాయి. దీంతో ఆరోగ్య నిపుణులు సైతం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంపాక్స్ విజృంభణ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ రెండోసారి హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించింది. ఆ తర్వాత ఎంపాక్స్ కొత్త స్ట్రెయిన్, క్లాడ్ ఐబీ గుర్తించారు. ఇదే కేసుల పెరుగుదలకు దారితీసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మధ్య, పశ్చిమ ఆఫ్రికా దేశాల్లో జూనోటిక్ వైరల్ కేసులు భారీగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం కాంగో దేశంలో ఎంపాక్స్ కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వైరస్ సోకిన వారి సంఖ్య ఇటీవల భారీగా పెరిగింది. కాంగో ఆరోగ్యశాఖ మంత్రి రోజర్ కంబా ప్రకటన ప్రకారం.. ఇప్పటి వరకు 18వేల మందికిపైగా కేసులు రికార్డయ్యాయి. ఇందులో కనీసం 610 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ప్రకటించారు. విస్తరిస్తున్న వైరస్ మధ్య ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎంపాక్స్ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వైరస్ ప్రధానంగా లైంగిక సంబంధాలు, వైరస్ సోకిన వ్యక్తులకు దగ్గరగా ఉండడం, రోగులు వాడిన దుస్తులు వాడడం వల్ల వైరస్ సోకుతుందని నిపుణులు సూచించారు. కాంగోతో సహా అనేక దేశాల్లో కొత్త ఎంపాక్స్ స్ట్రెయిన్‌పై అధ్యయనం చేస్తున్న శాస్త్రవేత్తలు వైరస్ ఊహించినదానికంటే చాలా వేగంగా వ్యాప్తి చెందుతుందని, రూపంలోనూ మార్పులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

# ఎన్ని రోజులు ఇలా తప్పించుకుంటావ్?: ఈటల



హైదరాబాద్, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎన్ని రోజులు ఇలా తప్పించుకుంటావని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బిజెపి మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ ఘాటుగా విమర్శించారు. హైడ్రా పేరుతో హడావుడి చేస్తూ హైడ్రామా చేస్తోందని ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించారు. శుక్రవారం నాగోల్‌లో జరిగిన పార్టీ సభ్యత్వ నమోదుపై వర్క్ షాప్‌లో పాల్గొన్న ఈటల మాట్లాడుతూ హైడ్రా పేరుతో పేదల జోలికి వస్తానంటే అది మీ తరం కాదని, పేదల జోలికి వస్తే కబడ్దార్ అని హెచ్చరించారు. నిజంగా రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయే పనే చేయాలంటే ముందుగా బాధితులకు ప్రత్యామ్నాయంగా ఇళ్లు నిర్మించి ఇచ్చి అప్పుడు కూల్చి వేయాలన్నారు. అంతే తప్పు ఆరు గ్యారెంటీల హామీలపై చర్చ జరగకుండా ఎన్ని రోజులు తప్పించుకుంటారో చూస్తామని హెచ్చరించారు. ఇవాళ మీరు తప్పించుకోవచ్చు కానీ ప్రజాక్షేత్రంలో మీకు శిక్ష తప్పదన్నారు. మీరు రెడ్ బుక్ రాస్తున్నానని గతంలో చెప్పావు, బీజేపీ తరపున మేము కూడా నీ చిట్టా అంతా రాసుకుంటున్నామని సందర్భం వచ్చినప్పుడు ప్రజాక్షేత్రంలోనే తేల్చు కుంటామని పేర్కొన్నారు. రాజ్యంగబద్ధమైన పదవిలో ఉన్న సీఎం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డిపై సుప్రీంకోర్టు కామెంట్స్ చూస్తే ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఎంత బాధ్యతా రహిత్యంగా, సంస్కారహీనంగా మాట్లాడుతున్నారో అర్థమవుతున్నదని అన్నారు. ఈ ఏడాది, వచ్చే ఏడాది అన్ని స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగబోతున్నాయని పార్టీ ప్రయోజనాల దృష్ట్యా అనుభవం కలిగిన పెద్ద లీడర్లు సైతం లోకల్ బాడీ ఎన్నికల పోటీలో ఉండబోతున్నారని రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ విషయాన్ని జేపీ నడ్డా, అమిత్ షా సైతం ఇదివరకే చెప్పారని అందువల్ల పార్టీ సభ్యత్వ నమోదు ప్రాముఖ్యతను అన్ని మోర్చాలు గుర్తించాలని సూచించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలన చూశామని వీరిని భరించే స్థితిలో లేమని బీజేపీనే గట్టిగా పోరాటం చేయాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజాక్షేత్రంలో వెలిసిపోవడానికి ఐదేళ్లు పడితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రం తొమ్మిది నెలలు కూడా పట్టలేదన్నారు. 2018 నాటికే కేసీఆర్‌ను ప్రజలు చీదరించుకున్నా ప్రయత్యామ్నాయం లేక పోపోవడంతో మరో సారి గెలిచారని ఆయన విమర్శించారు. అధికార పార్టీ కావడంతోనే గత స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎక్కువ స్థానాలు గెలుచుకోగలిగిందన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com